# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 40 సంచిక 7

పేజీలు 44

మార్చి 2021

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**


దాశరథీ శతకము ....................................4

శ్రీబాబూజీ ఉవాచ.................................... 5

అమ్మమాట............................................ 7

కర్మ ఫలం ............................ ...................9

అగస్త్య హృదయం ...................... ..............11

అమ్మతో మాట ........................................13

వ్యవసాయం .................. .........................14

నిర్మోహత్వం - నిస్సంగత్వం ......................15

రామాయణంలో స్త్రీ పాత్రలు.......................17

బాబూజీతో అనుభవాలు ............................19

వైరాగ్యం ........................ ................ ..............21

ఈశ్వరుడు ........................... .....................25

మధురం మధురం మధురం ...............28

శ్రీ కృష్ణజన్మాష్టమి ............... ....... ..... ..............30

కైవల్యోపనిషత్ ... ...........................................32

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు.............................34

సద్గురు యాజమాన్యం వివరాలు .........35

శ్రీ నృసింహ యోగీంద్రులు ............................36

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38

విష్ణు కథలు ...... ........................... ....................40

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

8) శ్రీ రమణీయహార యతసీ కుసుమాభ శరీర, భక్త మం
దార, వికారదూర, పరతత్త్వ విహార త్రిలోక చేతనో
ద్ధార, దురంత పాతక వితాన విదూర, ఖరాది దైత్యకాం
తార కుఠార భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ!

భావం -రమణీయ హారములు గలవాడవు, అవిసెపూవు వంటి శరీరకాంతి కలవాడవు, భక్తులకు కల్పవృక్షమవు, వికారములు లేనివాడవు, దేవతా తత్త్వమందు విహరించువాడవు, మూడు లోకములందు గల ప్రాణులను పోషించు వాడవు, పాపముల పోగొట్టువాడవు, ఖరాది రాక్షస అరణ్యమునకు గొడ్డలివంటి వాడవు దాశరథీ కరుణాపయోనిధీ!




*అజ్ఞాని చేసిన పని అన్నీ తెలిసినవాడు చేస్తే ఏమౌతుంది?
*ఎటువంటి భక్తులు నరకాన్ని అనుభవిస్తారు?
*గాలిలేని దీపం లాగా మనస్సును నిలబెట్టేది ఏది?
*గురువు ఆగమనం జరగాలంటే శిష్యుడు స్థితి ఎలా వుండాలి?
*యువరాజు మరణించాడని సాధువు ఎందుకు అబద్ధమాడాడు?
*నిన్న, రేపు పునీతం అవ్వాలంటే ఏం చేయాలి?
*పరమేశ్వరునికి ఎటువంటి బిల్వదళం సమర్పించాలి?
*క్షేత్రాలలో దేవుడి కంటే ఏ దేవుడు కమ్మగా వుంటాడు?
*రణభూమిలో మరణవిజేత ఎలా కావచ్చు?
*భక్తులలో రకాలు ఎన్ని?

***సమాధానాలు లోపలి పేజీలలో............................***

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

9-10-1980

ఈరోజు ఉదయం వ్యాహ్యాళిలో "శ్రీరామ జయరామ జయజయరామ" అనే నామం అందరినీ చెప్పమన్నారు. చాల ఆనందంగా ఉంది. కొద్దిసేపు వాకింగ్ అయిన తర్వాత శ్రీ బాబు మాట్లాడుతూ "ప్రతి వస్తువు ఎక్కడ పుట్టిందో ఎక్కడ వినియోగ పడాలో పరమాత్మునిచేత నిర్ణయింపబడి ఉంటుంది. గుండుగొలనులో 25 సంవత్సరాల క్రితం తయారుచేయబడిన ఇటుకలు ఈనాడు పరమేశ్వరుని ఆలయానికి వినియోగపడుతున్నాయి. అదీ ఆయనే నిర్ణయించి ఉంటాడు. మానవుడు ఎప్పుడు పుట్టాడో, ఎక్కడ పెరుగుతాడో, ఏ రోజు కాలగర్భంలో కలసిపోతాడో ఎవరు చెప్పగలరు? పరమేశ్వరుడికే తెలియాలి. ఒక తప్పటడుగు వేసిన స్త్రీ శేషజీవితాన్ని సరిగా గడిపినట్లయితే, ఒకడినే నమ్ముకున్న ఉత్తమురాలితో సమానము. కాని అదే వ్యక్తి అదే తప్పు అనేక పర్యాయములు చేసినట్లయితే ఆమె వ్యభిచారిణిగా పరిగణింపబడుతుంది.



అదేవిధంగా ఒక భక్తుడు ఒక తప్పు చేసినా, తర్వాత మంచి మార్గాన్ని అవలంబించి తరించవచ్చు. భక్తులలో అనేక రకాలుంటారు. ఒకరకమైన భక్తుడు పుట్టుకతోనే భక్తుడుగా ఉద్భవిస్తాడు. రెండవరకం భక్తుడు కొంతకాలం సాధారణ జీవితం గడిపిన తర్వాత భక్తుడిగా మారతాడు. మూడవరకం భక్తుడు తాను భక్తునిగా నటిస్తాడు. వాడు వ్యభిచారిణితో సమానము. ఆమె కూడా పతివ్రతలాగా నటిస్తుంది.

ఈ కపట భక్తుడు అందరికన్న ఎక్కువ డబ్బు ఇస్తాడు, గొప్ప భక్తునివలె. కాని లోగడ భగవంతుని ద్వారా చాల ధనాన్ని ఆర్జించి

వుంటాడు. పరమేశ్వరుడి సొమ్ము చాల కాజేసి ఉంటాడు. భగవంతుని ద్వారా ఆర్జించిన సొమ్ము పరమాత్ముడు ఏం చేసుకుంటాడులే అని తానే స్వాహాచేస్తాడు. అటువంటి కపటభక్తులు నాటకంలోని పాత్రలవంటివారు. ఉదాహరణకి భక్తప్రహ్లాదలో నరసింహావతారం వేషగాడిని జాగ్రత్తగా కూర్చోవయ్యా అని హిరణ్యకశిపుడే హెచ్చరిస్తాడు. అది నటన కాబట్టి. మనపాత్రలు కూడ నిజజీవితంలో అంతే.

అటువంటి కపట భక్తులు కీటక జన్మనుంచి ప్రారంభించి అనేక కోట్ల జన్మలెత్తి నరకాన్ని అనుభవించవలసివస్తుంది. అది ఎవరూ తప్పించలేరు. కాని భక్తులకు సరియైన మార్గాన్ని చూపే మహాత్ముడే గురుమూర్తి. అటువంటి గురుమూర్తిని ఆశ్రయించి ఆయన కటాక్షంద్వారా తామెవరో తెలుసుకో గలుగుతారు. గురుమూర్తికి ఆత్మవస్తువుకి తేడాలేదు. ఆయన చరణములను ఆశ్రయించినవారికి జన్మరాహిత్యాన్ని ప్రసాదిస్తారు. కాని కపటభక్తులు మాత్రం నరకం అనుభవించక తప్పదు. మనము చేసిన ప్రతి తప్పుకు వెంటనే అనుభవం ఉండకపోవచ్చు. దానికి కొంత వ్యవధి పట్టవచ్చు. కాని ఫలితం అనుభవించక తప్పదు. తెలిసిచేసినా తెలియక చేసినా నిప్పులో చేయి పెడితే కాలక ఊరుకుంటుందా?

ఉదాహరణకి మనము ఎంతో రుచికరంగా తయారు చేసుకొన్న నిమ్మకాయ పులిహోరని ఎంతో మెచ్చుకుంటూ ఎంత తింటున్నామో తెలియకుండా మితిమీరి తింటాము. కాని వెంటనే ఏమి జరగకపోవచ్చు. ఆ పులిహోర రుచిలో సర్వాన్ని మరచి మీ శ్రీమతికి ఒక ఖరీదైన కంచి పట్టుచీర తెస్తానని వాగ్దానం కూడా చేయవచ్చు. కాని ఒక గంట తర్వాత ఉరుములు, మెరుపులు, వర్షం ప్రారంభం అయి ఆయనకి నీరసం వస్తుంది. బాత్‌రూములోనే పడిపోతాడు. అప్పుడు జ్ఞాపకం వస్తాడు పరమాత్ముడు. యజమాని బాత్‌రూమ్‌లో పడిపోగానే ఇంట్లోవాళ్ళంతా గొల్లుమంటారు. డాక్టరు సంచి ఘల్లుమంటుంది. కాని ఆయన శ్రీమతి దృష్టి మాత్రం చీరమీదే ఉంటూ అయ్యో! ఈయనకు ఏమౌతుందో ఏమో నాకు చీర తెస్తానన్నారు అనుకుంటుంది. కొడుకు ఈయన పోతాడేమో డబ్బు ఎక్కడ పెట్టాడో చెప్పలేదు అని ఆలోచిస్తాడు. చూశారా నిజజీవితంలో మానవుల ప్రేమ ఎలా ఉంటుందో" అన్నారు శ్రీ బాబు.

# అమ్మమాట

- జపమాల ప్రసాద

## *ఏవి మన వెంట వచ్చేవి?*

"మన జీవితంలో ఎన్ని ఏళ్ళు గడచిపోయాయో! ఇంతవరకూ మనం ఏం దాచుకోగలిగాం? ధనమా, ధాన్యమా; వస్తు, వాహనాలా? వాటిల్లో ఎన్ని మిగిలాయి యీనాడు మనకు? దీనిని గురించి జాగ్రత్తగా ఆలోచించండి, విచారణ చేయండి. ఈనాటికీ, ఏనాటికీ కూడా సత్సంగంలో దొరికే ఆణిముత్యాలు మాత్రమే మన వెంట వస్తున్నాయి. శ్రీ సద్గురుదేవులు ఎన్నెన్నో మంచి విషయాలను మనకి వినిపిస్తున్నారు. మనం ధ్యానానికి కూర్చుంటే, ఆ సద్విషయాలు మన మనస్సులలో మెదులుతున్నాయి. గాలిలేని దీపం లాగా మన మనస్సును నిలకడగా నిలబెడుతున్నది గురుబోధ. కనుక, విషయాదులనే గాలి రాకుండా నీ మనస్సుతో నీవే సత్సంగం



చేసుకోవాలి. దీనినే ఆత్మ విచారణ అంటారు. ఈ విచారణ అనేది ఒక గాజు చిమ్నీ లాగ మనస్సనే చంచలమైన దీపాన్ని, నిశ్చలంగా వుండేటట్లు చూస్తుంది. విషయాదులనే గాలికి నా మనోదీపం ఆరిపోకుండా కాపాడుతుంది. మనం పళ్ళుగాని, పువ్వులు గాని కొనేటప్పుడు కుళ్ళినవాటినీ, వడలిపోయినవాటినీ, పుచ్చిపోయిన వాటినీ ఏరివేసినట్లు, మన అంతఃకరణలోని నలుమూలలా వెదకి, వెదకి, నీచ సంకల్పాలని, విషయవాసనలను, ప్రాపంచిక భోగలాలసత్వాన్ని ఏరిపారవేయాలి. అవి తిరిగి మనలను బాధించకుండా ఉండాలంటే వాటిని జ్ఞానమనే (ధ్యానమనే) అగ్నిలో వ్రేల్చాలి. ఎల్లవేళలా మనం కూర్చుని ధ్యానం చేసుకోలేకపోవచ్చుగానీ, ఏ పని చేస్తున్నా, ఎక్కడ వున్నా భగవన్నామ స్మరణ చేసుకోవచ్చు. ఈ నామ స్మరణ ద్వారా నామాగ్నిని రగుల్కొల్పితే, మీలోని విషయాదులు, వాసనలు భస్మం అయిపోతాయి. ఇలా శుద్ధమైన అంతఃకరణలో నీ నిజ ఆత్మ స్వరూపాన్ని నీవు దర్శిస్తావు.

నీవు ఏ ప్రపంచంలో మెలకువగా వుండి 'జాగ్రత్' అనుకుంటున్నావో, అది స్వప్న ప్రపంచం మాత్రమే అని జ్ఞానమనే మెలకువ కలిగిననాడు తెలుసుకుంటావు. గీతాచార్యుడు 'శ్రద్ధావాన్ లభతే

**జ్ఞానమ్**' అని చెప్పి కేవలం శ్రద్ధ ఒక్కటే చాలదు '**తత్పరః సంయతేంద్రియః**' అని చెప్పాడు. నీవు సాధించాల్సిన లక్ష్యమందు తత్పరత కలిగి వుండాలి; నీ ఇంద్రియాలన్నిటినీ నీ అదుపులో వుంచుకోవాలి. ఇంతకుముందు అనేకసార్లు ఒక్కొక్క ఇంద్రియానికి లోబడి ఒక్కొక్క జంతువు ఎలా ప్రాణాలు కోల్పోతుందో చెప్పుకున్నాము. వేణునాదానికి (శ్రోత్రేంద్రియం) లోబడి జింక; త్వగింద్రియానికి (స్పర్శకు) లోబడి ఏనుగు; చక్షురింద్రియానికి లోబడి మిడుత; రసనేంద్రియానికి లోబడి చేప; ఘ్రాణేంద్రియానికి లోబడి తుమ్మెద బలి అయిపోతున్నాయి. ఒక్కొక్క ఇంద్రియానికి లోబడితేనే తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయి ఈ మూగ జీవాలు. మరి 'బుద్ధి' అనే విచక్షణా జ్ఞానం కలిగి వున్నా కూడా ఆ అయిదు ఇంద్రియాలకీ దాసుడైపోతున్న మానవుడి గతి ఏమిటి? అని వాపోయారు ఆదిశంకరాచార్యులవారు. వైరాగ్యం అనేది ఎక్కడి నుంచో వచ్చేది కాదు. అది తనంత తానుగా తెచ్చుకునేది. ఎవరికివారు సంపాదించుకునేది. దృఢమైనట్టి పట్టుదలే వైరాగ్యం అని, భగవంతుడిని ప్రేమించడమే భక్తి అని శ్రీగురుదేవులు శెలవిచ్చి వున్నారు. ఈ భక్తి, వైరాగ్యములనే రెండు రెక్కలు కలిగి వుంటే చిటారు కొమ్మ మీద వున్న మోక్షఫలాన్ని కూడా అందుకోవచ్చు.

ప్రపంచం వైపు పరుగులెత్తే ఇంద్రియాలను ఎలా భగవంతుడి వైపు త్రిప్పాలో శ్రీకులశేఖరాళ్వారు తమ ముకుందమాలలో చెప్పారు. 'ఓ జిహ్వేంద్రియమా! నీవు కేశవుడిని కీర్తించు, ఓ చిత్తమా! మురరిపుడైన శ్రీహరిని భజించు, ఓ చేతులారా! మీరు చక్కగా శ్రీధరుడిని అర్చించండి, ఓ చెవులారా! మీరు చక్కగా హరి కథలనే శ్రవణం చేయండి, ఓ నాసికేంద్రియమా! ఆ ముకుందుడి పాదాలను అలంకరించిన తులసినే ఆఘ్రాణించు, ఓ శిరసా! అధోక్షజుడైన హరిపాదాలకి నమస్కరించు, ఓ కన్నులారా! మీరు శ్రీకృష్ణుని దివ్యమంగళ విగ్రహాన్నే చూడండి, ఓ పాదములారా! మీరు ఆ హరి దేవాలయం వైపే నడవండి' అని తమ ఇంద్రియాలను శాసించారు.

అటువంటి ఇంద్రియ నిగ్రహశక్తిని, అఖండ భక్తిజ్ఞాన వైరాగ్యములను ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!

# కర్మ ఫలం

సేకరణ - రమణ ప్రసాద్

ఒక అడవిలో కొంతమంది ఆటవికులు ఒక గుడి కట్టుకున్నారు. వారికి రాతి విగ్రహాలు దొరకవు కనుక ఒక చెక్క దుంగని విగ్రహంలా చేసి, పసుపు, కుంకుమలు పెట్టి, వస్త్రం కప్పి దానికే పూజలు చేసేవారు. అమ్మవారు కూడా ప్రసన్నమై కోరిన కోర్కెలు తీర్చేది. ఆ గుడికి ఒక పూజారిని మాట్లాడి నిత్యం పూజలు చేయించేవారు. అతడు అక్కడికి 5 మైళ్ళు దూరం నుండి రోజు వచ్చి పూజలు చేసి వెళుతూ వుండేవాడు. ఒక్కనాడు  కూడా విసుక్కోలేదు. ఇది ఇలా జరుగుతూ వుండగా ఒకనాడు భోరున వర్షం కురిసింది. కుంభవృష్టిగా మారింది.

ఆ రోజు ఆ గుడి దగ్గర్లోకి కట్టెలు కొట్టుకొనేవాడు ఒకడు వచ్చాడు. వర్షం కురుస్తూ వుండటం వలన నిలవడానికి నీడలేక చుట్టూ వెదికితే దగ్గరలో ఈ గుడి కనబడింది. వెంటనే గుడిలోకి వెళ్ళాడు. ఎదురుగా చూస్తే పెద్ద దుంగ కనబడింది. వెంటనే ఆహా! వర్షం వచ్చి చెట్లన్ని తడసిపోయాయి. ఈ రోజు కడుపుకి తిప్పలే అనుకుంటున్న తరుణంలో ఎదురుగా ఇంత పెద్ద దుంగ దొరకడం అదృష్టం! అనుకుని, ఆటవికులు పూజించే ఆ దుంగని నరకబోయాడు. వెంటనే 'ఒరేయ్! నన్ను కొట్టవద్దు' అన్నది అందులో వున్న అమ్మవారు. వీడు దేవుడు, దెయ్యం అంటే ఏమిటో తెలియని నిషాదుడు కనుక 'ఎవర్రా? దుంగ వెనుక నిలబడి మాట్లాడుతున్నది రండి బయటకు' అన్నాడు అమ్మవారని తెలియని ఆ అజ్ఞాని.

అప్పుడు ఆ దుంగ నుండి అమ్మవారు బయటకు వచ్చి, 'నేను అమ్మని. నన్ను కొట్టకు' అనగానే! మరి 'నిన్ను కొట్టకపోతే, నా కడుపు సంగతి ఏమిటి?' అని అడిగాడు. వెంటనే అమ్మవారు 'ఇదిగో! నీకు 100 బంగారు నాణాలు ఇస్తాను' అంటూ ఒక మూట అక్కడ పడేసి మాయమైపోయింది. ఆ మూటలో వున్న బంగారు నాణాలు చూసేసరికి వాడు ఆ గొడ్డలిని అక్కడే పారవేసి, ఆ మూట పుచ్చుకుని పారిపోయాడు. అప్పుడే అక్కడకి వచ్చి ఇదంతా చూస్తున్న పూజరికి ఒక సందేహం వచ్చింది. 'రోజూ నేను ఇంత దూరం నుండి వచ్చి పూజలు చేస్తుంటే నాకు మాత్రం ఏమీ ఇవ్వదా! గొడ్డలితో కొట్టబోయిన ఆ బోయవాడిని కనికరించిందా!' అనుకుని ఆ పూజరి కూడా ఆ గొడ్డలితో అమ్మవారిని నరకబోయాడు. గొడ్డలి ఎత్తాడో లేదో, ఆ పూజారికి కంటి చూపు పోయింది. వాడు వెంటనే పశ్చాత్తాపంతో 'అమ్మా! ఎంత అపచారం

చేశాను! నన్ను క్షమించు తల్లీ!' అనగానే, అమ్మవారు ప్రత్యక్షమై 'వాడు అజ్ఞాని. వాడికి దేవుడు అంటే ఏమిటో తెలియదు. నన్ను చూసి ఒక కట్టె ముక్క అనుకుని నరకబోయాడు. నువ్వు జ్ఞానివి. నిత్యమూ నన్ను పూజిస్తున్నావు. అజ్ఞాని నరకబోగా కనికరించాను అనుకుని, నువ్వు కూడా అదేపని చేయబోయావు. ఏమీ తెలియని అజ్ఞాని చేసిన పని, అన్నీ తెలిసిన నీవూ చేస్తే ఎలా? పైగా దేవతలాగా కొలిచే నన్నే నరకబోయావు. అందుకే కంటి చూపు మాత్రమే తీసేశాను. చూపు తీయకపోతే నీవు పూర్తిగా సర్వనాశనం అయిపోయేవాడివి' అన్నది.

వెంటనే ఆ పూజారి 'అమ్మా! క్షమించు. మరొకసారి ఇటువంటి పొరబాటు చేయను. దయచేసి నాకు చూపును ప్రసాదించు!' అని పలుమార్లు వేడుకొనగా, జగన్మాత కనికరించి వానికి చూపునిచ్చి, 'వాడికి సంపద దొరికిందని నువ్వు పొరబాటు పడుతున్నావు. అకారణంగా వచ్చిన సంపాదన ఉపయోగపడదు. అక్కడ ఏమి జరుగుతుందో నీకు తెలియదు. నీవు అక్కడకు వెళ్ళి చూడు' అనగానే బోయవాడిని అనుసరించాడు ఈ పూజారి.

బోయవాడు తన ఇంటికి చేరి, భార్యను పిలచి, జరిగినది చెప్పి, 'ఇదిగో! 100 బంగారు నాణాలు' అని చూపించగానే భార్యకి ఆ బంగారం మీద ఆశ పుట్టి, నాకు వడ్డాణం చేయించు, ఉంగరం చేయించు, బొంగరం చేయించు ....అని భర్తను అడిగింది. భర్త భార్యమాట వినలేదు. ఇంతలో కొడుకు వచ్చాడు. వాడు వ్యసనపరుడు. రోజంతా పూర్తిగా త్రాగుతూనే వుంటాడు. అప్పటికే బాగా త్రాగి వున్నాడు. ఆ బంగారు నాణాలు చూసి, 'నాన్నా! అవి నాకు ఇవ్వు. నేను జూదమాడాలి. బాగా త్రాగాలి' అన్నాడు. భార్యని, కొడుకుని బయటకు గెంటి, లోపల వున్న బీరువాలో ధనం దాచాడు. భార్య లోపలికి వచ్చింది. ఇద్దరికీ వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఇంతలో కొడుకు లోపలికి వచ్చి, గొడ్డలితో తల్లిదండ్రులిద్దరినీ నరికివేసి, ఆ మూట పుచ్చుకుని వెళ్ళిపోయాడు. అలా అకారణంగా వచ్చిన సంపద అకారణంగానే వెళ్ళిపోయింది. ఆ సంపదతోపాటు ప్రాణాలు కూడా పోయాయి. అది చూసి హడలిపోయిన పూజారి వెంటనే గుడిలోకి వెళ్ళి అమ్మపాదాల మీద పడిపోయాడు. అనేక క్షమాపణలు కోరాడు.

మనకు ఏది కావాలో మనకు తెలియదు. మనలను సృష్టించిన పరమాత్మకు మనకు ఎప్పుడు ఏది ఇవ్వాలో తెలుసు.

# అగస్త్య హృదయం

(గత సంచిక తరువాయి)

- వారణాసి కాశీప్రసాద్ U.S.A

అరణ్యకాండ తరువాత అగస్త్యమహర్షి యొక్క ప్రస్తావన యుద్ధ కాండలో కనిపిస్తుంది. రామ రావణుల మధ్య జరిగే భీకరమైన సంగ్రామం గురించి వివరిస్తూ వాల్మీకి మహర్షి '**గగనం గగనాకారం సాగరః సాగరోపమః రామరావణయోర్యుద్ధం రామరావణయోరివ**' అంటూ 'గగనానికి గగనమే సాటి, సాగరానికి సాగరమే పోలిక, అలాగే రామరావణ యుద్ధానికి తుల్యమైనది మరొకటి లేదు' అని వివరిస్తారు. అలాంటి పోరులో రావణుడి శక్తి సన్నగిల్లిన సమయంలో రథసారథి యుద్ధరంగం నుండి రథాన్ని మళ్లిస్తాడు. దానితో మండిపడిన రావణుడు రథాన్ని తిరిగి యుద్ధభూమికి తరలించమని ఆదేశిస్తాడు. ఆ సమయంలో అగస్త్యమహర్షి హుటాహుటిన యుద్ధరంగానికి చేరుకుని, అలసి వున్న శ్రీరామచంద్రునకు 'ఆదిత్యహృదయము'ను ఉపదేశిస్తారు.

ముందు వివరించుకున్నట్లు ఆదిత్యహృదయమునకు, భగవద్గీతకు చాలా సారూప్యం కనబడుతుంది. నిజానికి మహాభారత అంతర్గతమైన భగవద్గీతకు త్రేతాయుగంలో చెప్పబడిన ఆదిత్యహృదయమే మూలమని కూడా భావించవచ్చు. ఈ రెండూ యుద్ధరంగంలో గురువు చేత శిష్యునకు చెప్పబడినవే. ఆదిత్యహృదయము సూర్యమండల అంతర్వర్తియైన పరమాత్మను గురించి గురువు శిష్యునకు చేసే ఉపదేశం లాగా కనిపిస్తుంది. అదే బోధ మరింత వివరంగా గురుశిష్య సంవాద రూపంలో భగవద్గీతలో కనిపిస్తుంది. రెండింటిలోనూ శిష్యుని విజయపథం వైపు తీసుకు వెళ్లడం నిమిత్తకారణంగా కనిపించినా, అన్ని యుగాలలోనూ మానవాళికి ఉపయోగపడే జ్ఞానబోధా సారం లభిస్తుంది.

**తతోయుద్ధ పరిశ్రాన్తం సమరే చింతయాస్థితమ్ ।**
**రావణంచాగ్రతో దృష్ట్వా యుద్ధాయ సముపస్థితమ్ ॥**

అటుపిమ్మట యుద్ధ రంగంలో అలసి వున్న శ్రీరామచంద్రుడు తనను సమీపిస్తున్న రావణుని పరికిస్తూ, దీర్ఘాలోచనలో మునిగి వున్నాడు. - ఈ శ్లోకము గురువు యొక్క ఆగమనానికి కారణమైన

శిష్యుని స్థితిని ప్రస్తావిస్తుంది. అయితే భగవద్గీతతోపాటుగా ఆదిత్య హృదయం వెనుక యుద్ధానికి వున్న ప్రాముఖ్యతను పరిశీలించవలసి వుంటుంది. శ్రీకృష్ణపరమాత్మ కూడా 'సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్యచ' అంటూ సర్వకాల సర్వావస్థలయందు నన్నే స్మరించు.... యుద్ధము నందు సైతము అని శెలవిచ్చారు. అలాగే

**యత్ర యోగీశ్వరః కృష్ణః యత్ర పార్థో ధనుర్ధరః**

**తత్ర శ్రీః విజయోర్భూతిః ధృవానీతిర్మతిమమ ॥** అంటూ ఎక్కడైతే రథ సారథిగా వున్న యోగీశ్వరుడైన కృష్ణునితోపాటు ధనుర్ధారియైన పార్థుడు వుంటాడో, అక్కడ లక్ష్మీ కటాక్షము, విజయము తథ్యమని చెప్పబడినది. అలాగే ఈ యుద్ధాన్ని అస్త్రశస్త్రాలతో చేసే పోరాటం లాగా కాకుండా, సాధకుడిని నిరంతరము పరీక్షిస్తూ అరిషడ్వర్గంగా తెలుప బడిన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాది శత్రుకూటమితో సలిపే పోరుగానూ, అంతరేంద్రియములైన మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములను సత్యం, శాంతి, దయ, ప్రేమలవైపు మళ్ళించే అంతర్మథనముతోను పోల్చుకోవచ్చు.

**'పరిశ్రాన్తమ్'** అన్న పదాన్ని అలసి వున్న శ్రీరాముని స్థితినే కాక, ఈ అంతర్యుద్ధములో జీవుడు పడుతున్న ఆవేదనగా కూడా పరిగణించ వచ్చు. తతః (అటు పిమ్మట) అన్న శబ్ద ప్రయోగము ఎన్నో జన్మలగా జీవుడు సలుపుతున్న పోరుగా సూచిస్తుంది.

- సశేషం

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా మార్చి, ఏప్రియల్ 2021 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***మార్చి 2021 :*** AS 2163, 5338, 7244, 7245, 7248, 7685, 8027, 8159, 8522, 8524, 8525.

***ఏప్రియల్ 2021 :*** AS 4102, 6345, 6431, 7070, 7256, 7269, 7742, 7743, 8016, 8025, 8026, 8035.

# అమ్మతో మాట

(గత సంచిక తరువాయి)

- సేకరణ నేలభొట్ల ప్రసాద్

**శుభగాత్రి గిరిరాజపుత్రి**

**అభినేత్రి శర్వార్థ గాత్రి**

**సర్వార్థ సంధాత్రి**

**జగదేక జనయిత్రి** .............. ఇలా అద్భుతంగా సాగిపోతుందా పాట.

మీ ఆయన అయిన శర్వునిలో నీవు సగభాగం కాబట్టి శర్వార్థ గాత్రి అన్నారు. గాత్రము అంటే శరీరము అనే అర్థం కూడా వుంది కదా! అలాగే సర్వ కార్యసిద్ధిని ఇచ్చుదానవు కాబట్టి సర్వార్థ సంధాత్రి అన్నారు. అసలు శర్వార్థ, సర్వార్థ అనే పదాలు వినడానికి కొంచెం ఒకేలాగా వున్నా, ఎంతటి భేదం వున్నదో కదా వాటి మధ్య. అదీ మా వేటూరంటే! అదీ నీ కరుణ ప్రసరించిన వారి కవిత్వమంటే!

ఈ రోజు నీతో ఇలా ఏవేవో చెప్పేస్తున్నాను. అప్పట్లో శివరాత్రికి మీ ఆయనకోసం, శ్రీరామ నవమికి మీ అన్నయ్యకోసం, రెండు ఉత్తరాలు వ్రాశాను. వాళ్ళందరికీ వ్రాసి, మీ అందరికీ తల్లినైన నాకు మాత్రం వ్రాయవా అంటావేమో అని ఈ మాటలన్నీ అరచిమరీ చెబుతున్నాను. వింటున్నావు కదా!

ఇక్కడ వంటింట్లో పని చేసుకుంటున్న మా అమ్మకు ఏదో ఒకటి చెబుతూ, మధ్యమధ్యలో 'ఇదిగో అమ్మా! వింటున్నావా? ఓ అమ్మా!' అని అరుస్తుంటాను. మా అమ్మేమో 'ఊఁ! చెప్పరా!' అంటుంది తన పని తాను చేసుకుంటూనే. కాకపోతే ఆవిడకు ఇక్కడ ఒకింటి పనే కాబట్టి ఇబ్బంది లేదు. కానీ, నీ సంగతి అలా కాదు కదా! అనంతకోటి బ్రహ్మాండాలన్నీ పరిపాలించే తల్లివి. లోకాలన్నిటినీ తన బొజ్జలో దాచుకున్న ఆ పరమశివుని భార్యవు. '**సదాశివ కుటుంబిని**'వి. అందుకే కోట్లాదిమంది పిలుపులలో నా పిలుపెక్కడ వినబడదో అన్న భయం చేత, ఇంకాస్త గట్టిగా అరచి చెబుతున్నాను.

**ఇదిగో అమ్మా! ఇటూ .... ఈ వైపు ..... నా వైపు కాస్త చూడు! నేనూ!........ స్వస్తి!**

# వ్యవసాయం

సేకరణ - భీమవరం గుప్తా

మనలో చాలామందికి వ్యవసాయం తెలుసు. రైతు తొలకరి రాగానే చేనుకు నీరు పెడతాడు. అప్పటి వరకూ ఆ చేను మండుటెండలలో బీటలువారి వుంటుంది. అందువల్ల పారిన నీరు నిలబడదు. నీరు భూమిలోకి ఇంకిపోతుంది. లేకపోతే, గట్టుకున్న కన్నాల ద్వారా ప్రక్క చేనులోకి వెడుతుంది. రైతు కొంత సమయం చూసి, ఆ మడంతా ఒక్కసారి తిరుగుతాడు. నెర్రలు ద్వారా నీరు నిలవకపోతే, ఒక్కొక్క కన్నం మూసివేస్తూ, గట్టులంకలు వేస్తాడు. చేనులో నీరు నిలబడిన తరువాత అసలు పని మొదలు పెడతాడు. నాగలికట్టి, చేను మెత్తగా దున్ని, మెరకా పల్లం సమం చేస్తాడు. సరియైన విత్తనాలు ఎంపిక చేసి, ఒక రోజు మూటకట్టి, నానబెట్టి మొలక వచ్చిన తరువాత ఆకుమడిగా జల్లుతాడు. మంచి సేంద్రియ ఎరువును అందిస్తాడు. నారుమడి ఏపుగా పెరిగిన తరువాత ఆ ఆకు వేరు తెగకుండా తీసి మొత్తం మిగిలిన భూమిని పై విధంగా తయారుచేసుకుని, నాట్లు (ఊడ్పు) వేస్తాడు. అక్కడి నుండి రోజూ ఆ చేనును గమనిస్తూ, కలుపు తీస్తూ అవసరమైన ఎరువులు, సస్యరక్షణ చేస్తూ, చక్కటి పంట పండేదాకా కష్టపడతాడు. పంట చేతికి అందిన తరువాత ఎంతో ఆనందం పొందుతాడు.

శ్రీబాబు, మాతాజీ అనేకమార్లు తమ బోధలో క్షేత్ర శుద్ధి గురించి చెప్పేవారు. బీడు భూమిలాంటివారు ఎంతో మంది శ్రీవారి పాదాన్ని ఆశ్రయించిన తరువాత ఎంతో లాలనగా సరళమైన పలకరింపు ద్వారా (మన కష్ట సుఖాలు విచారిస్తూ) చేనుకు నీటిని అందిస్తూ, దున్నుతూ, మనస్సును వేరే విషయాదుల మీదకు పోకుండా నిలబెడుతూ, తమ అనుగ్రహం ద్వారా క్షేత్ర శుద్ధి చేసి, అప్పుడు బోధ ద్వారా అమృత వాక్కును ప్రసాదిస్తారు. (ఆ బీజాలు మొలకెత్తి చక్కని సస్యంగా మారిపంట పండే వరకు) సాధకునిగా మారి గమ్యస్థానం చేరేవరకు అన్నీ తానే అయి, మార్జాల కిశోర న్యాయాన కాపాడతారు. ఈ మధ్య కాలంలో సాధకుని కర్మ రహితం చేస్తూ ఆ తిప్పలన్నీ శ్రీగురుదేవులు తామే స్వీకరిస్తారు వారే సమర్థ సత్య గురుదేవులు. (నేను అనుభవించిన గురుతత్వం).

# నిర్మోహత్వం - నిస్సంగత్వం

సేకరణ -వంకిన సాయికృష్ణ

పూర్వకాలంలో మగధ దేశం రాజుగారు, రాజ కుమారుణ్ణి మంచి విద్యావంతుడిని చేశాడు. సర్వ శాస్త్రాలు నేర్పించాడు. రాజ్య పాలనకు సంబంధించిన అన్ని విషయాలలోనూ తర్ఫీదు ఇప్పించాడు. యౌవనవంతుడైన ఆ కొడుకును యువరాజ పట్టాభిషేకం చేశాడు. రాజ్య పాలనలో యువరాజు సలహాలు తీసుకునేవాడు.

ఒకసారి రాజ్యంలోని కొందరు ప్రజలు రాజు దగ్గరకు వచ్చారు. అడవికి దగ్గరగా వున్న గ్రామాలలోకి క్రూర మృగాలు వస్తున్నాయని, వాటి నుండి తమను రక్షించాలని కోరారు. వెంటనే రాజు ప్రక్కనే వున్న యువరాజు వంక చూశాడు. ఆ చూపును అర్థం చేసుకున్న యువరాజు ప్రజల వెంట అడవికి బయలుదేరాడు. క్రూర మృగాలను వేటాడుతూ యువరాజు అడవిలో చాలా దూరం పోయాడు. క్రూర మృగాలను చాలా మటుకు వధించాడు. వేటలో అలసట చెందిన యువరాజుకు దాహం వేసింది. నీళ్ల కోసం చుట్టూ చూశాడు. ఎక్కడా నీటి జాడ కనబడలేదు. దగ్గరగా వున్న చెట్టు ఎక్కి చూడగా కొద్ది దూరంలో ఒక ఆశ్రమం కనిపించింది. చెట్టు దిగి ఆ ఆశ్రమం చేరుకున్నాడు. అక్కడ ఒక స్వామి ధ్యాన నిమగ్నుడై వున్నాడు.

యువరాజు వచ్చిన అలికిడికి స్వామి కనులు తెరచి చూశాడు. యువరాజును లోనికి ఆహ్వానించాడు. అతిథి మర్యాదలు చేశాడు. ఆయన సేద తీరాక యువరాజును ఆ స్వామి 'మీరెవరు? మీ పేరేమిటి?' అని ప్రశ్నించాడు. అందుకా యువరాజు 'స్వామీ! మాది సమీపంలోని ఒక రాజ్యం. నేను యువరాజును నా పేరు మోహదీప్తుడు. అయినా అందరూ నన్ను నిస్సంగుడు అని పిలుస్తారు' అని సమాధానం చెప్పాడు.

ఆ స్వామి 'నాయనా! నీ పేరు కూడా విచిత్రంగా వున్నదే!' అన్నాడు. దానికి ఆ యువరాజు 'స్వామీ! నా ఒక్క పేరే కాదు. మా రాజ్యంలో అందరి పేర్లూ విచిత్రంగానే వుంటాయి' అన్నాడు. అలా అనగానే ఆ స్వామికి ఏదో తోచింది. 'యువరాజా! మీరు ఇక్కడే వుండి, విశ్రాంతి తీసుకోండి. ఆ పైన వున్న ఉత్తరీయం నాకివ్వండి. నేను రాజ్యంలోకి

పోయి వస్తాను' అని ఉత్తరీయం తీసుకున్నాడు. కొంత దూరం పోయాక ఆ ఉత్తరీయానికి అక్కడక్కడ కొంత రక్తం మరకలు పులుముకుని రాజ్యం చేరుకున్నాడు. రాజాంతఃపురం దగ్గర ఒక దాసీ ఎదురైంది స్వామికి. అప్పుడా స్వామి ఆ దాసితో 'అమ్మా! అడవిలో మీ యువరాజును పులి చంపివేసింది. ఇదిగో రక్తంతో తడిసిన ఆయన ఉత్తరీయం' అన్నాడు విచారంగా.

అప్పుడా దాసి 'దానిదేముంది స్వామీ! భగవద్గీతలోని రెండవ అధ్యాయంలోని శ్లోకాలను గుర్తుకు తెచ్చుకోండి' అని వెళ్ళిపోయింది. ఆశ్చర్యపోయిన స్వామి అంతఃపురంలోని రాజు దగ్గరకుపోయి యువరాజు మరణం గురించి చెప్పాడు. అందుకా రాజు ఆ స్వామితో 'ఋణగ్రస్తుడు. ఋణం తీరిపోయింది. వెళ్ళిపోయాడు' అని తిరిగి తన పనిలో తాను మునిగిపోయాడు. స్వామికి మరింత ఆశ్చర్యం కలిగింది. సరే అనుకొని ఈసారి రాణీగారి వాసానికి వెళ్ళి కొడుకు మరణ వార్త వినిపించాడు. అందుకామె బాధపడలేదు సరికదా, 'స్వామీ! చెట్టుపై సాయంత్రం చేరిన పక్షులు ఉదయమే వెళ్ళిపోతాయి. మరలా సాయంత్రం చెట్టుపైకి వచ్చి ఎన్ని పక్షులు చేరుకుంటాయో తెలియదు కదా!' అన్నది. ఇదేమిటి ఈమె కూడా ఇలా మాట్లాడుతున్నదే అనుకుని ఆ స్వామి యువరాజు భార్య దగ్గరకు వెళ్ళి ఈ విషయం తెలియజేశాడు. అందుకామె సమాధానంగా 'స్వామీ! ప్రవహిస్తున్న గంగానదిపై వున్న దుంగలం మేమంతా. అలలపై కొన్ని దుంగలు కొట్టుకుని పోతాయి. అందుకు చింతించవలసిన పని లేదు' అని సమాధానం చెప్పింది.

స్వామి ఇహ ఇక్కడ నాకేమీ పని లేదు అనుకుని తన ఆశ్రమం చేరాడు. ఇక్కడకు వచ్చి యువరాజుతో 'మీ రాజ్యాన్ని శత్రురాజులు ఆక్రమించారు. మీ తల్లిని, తండ్రిని బంధించారు' అన్నాడు. అందుకా యువరాజు 'స్వామీ! ఇందులో విచిత్రమేమున్నది? యాత్రికులలాగా ఇక్కడకి వచ్చాము. యాత్ర ముగిసింది. అంతేకదా' అని అనగానే స్వామికి ఆనందం రెట్టింపు అయింది. శంకరాచార్యులు చెప్పిన నిర్మోహత్వం అంటే ఏమిటో, నిస్సంగత్వం ఏమిటో అర్థం అయింది స్వామికి.

# రామాయణంలో స్త్రీ పాత్రలు

-సుషమ్నా ప్రసాద

(గత సంచిక తరువాయి)

## సీత

లక్ష్మణుడు వెంటరాగా, సీతారాములరణ్యంలో ప్రవేశించారు. అది దుర్గమమైన దండకారణ్యము. అక్కడ వారు మున్యాశ్రమాలు చూశారు. వారు ఒక మనోహరమైన, రమణీయమైన ముని పల్లెలో ప్రవేశించారు. ఋషులందరూ ఎదురు వచ్చి వారిని ఆహ్వానించారు. ఋషులను చూడగానే రాముడు ధనస్సు యొక్క నారిని విప్పి వినయశీలుడై సీతాలక్ష్మణ సమేతంగా వారికి నమస్కరించాడు. ఋషులందరూ రెప్ప వాల్చకుండా సీతారాముల దివ్య సౌందర్యాన్ని చూసి, ఉప్పొంగి, వుల్లాసమైన మనస్సులతో వినమ్రులై వారికి ఫలపుష్పాదులను సమర్పించారు. వారిచ్చిన ఆతిథ్యాన్ని స్వీకరించి, సూర్యోదయానికి పూర్వమే లేచి కాలకృత్యాదులు తీర్చుకుని ముని పుంగవుల అనుమతి తీసుకుని సీతారామ లక్ష్మణులు అరణ్యంలోకి ప్రవేశించారు. అలా వారు అనేకమంది ముని పుంగవుల ఆశ్రమాలను దర్శిస్తూ వనమునే రాజభవనంలాగా భావిస్తూ సీతారాములు ఆనందంగా జీవించారు. తరువాత శ్రీరామచంద్రుడు అగస్త్యాశ్రమానికి చేరుకున్నాడు. తన మహద్భాగ్యం వలన సీతారాముల దర్శనమైనదని ఎంతో పరవశించాడు అగస్త్యుడు. 'మీరు ముగ్గురూ వున్న ఏ ప్రదేశమైన మంగళకరము, శోభాయమానమై ప్రకాశిస్తుంది' అన్నాడు అగస్త్యుడు. ఆ తరువాత అగస్త్యుడు అంతర్ముఖుడై 'రామా! ఇక్కడకు రెండు యోజనాల దూరంలో గోదావరి తీరాన పంచవటి అనే మనోహరమైన ప్రదేశం వుంది. అక్కడ మీరు పర్ణశాల నిర్మించుకుని హాయిగా జీవించవచ్చు. అక్కడ కందమూలాలు, పుష్ప ఫలాదులు పుష్కలంగా లభించే పుణ్యభూమి అది' అని చెప్పాడు.

ఇంతవరకూ సీతారామలక్ష్మణులు భరద్వాజాశ్రమము, సుతీక్ష్ణాశ్రమము, శరభంగుని ఆశ్రమం, అగస్త్యాశ్రమం మొ॥గు గొప్ప ఆశ్రమాలను దర్శించారు. వారు పంచవటికి పోయే మార్గంలో ఒక పెద్ద గ్రద్దను చూశారు. ఆ పక్షి తాను దశరథుడి మిత్రుడినని చెప్పి వారిని సాదరంగా ఆహ్వానించి, తన పేరు జటాయువని, తన అన్న పేరు సంపాతి అని తెలియజేసింది. రామలక్ష్మణులు లేనప్పుడు తాను సీతమ్మకు తోడుగా వుంటానని చెప్పాడు.

ఆధ్యాత్మికంగా ఆలోచిస్తే పంచవటి అంటే మానవ శరీరమే.

పంచకోశముల సమూహమే పంచవటి. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశముల సమ్మేళనమే పంచవటి. జానకి వలెనే జీవుడు వివేకమనే లక్ష్మణుని తోడుచేసుకుని, పరమాత్మ అనే రాముని నీడలో వున్నంత వరకూ పంచవటిలో జీవితం ఆనందమయంగా గడిచింది. శూర్పణఖా ప్రవేశము పంచవటిలో జరిగింది. ఆమెకు శృంగభంగము జరిగింది. తన పగ తీర్చుకోవడానికి శూర్పణఖ సీతమ్మ సౌందర్యాన్ని వర్ణించి రావణుని కామాతురాన్ని రెచ్చ గొట్టింది. రావణాసురుడు పంచవటికి వచ్చి అక్కడ మారీచుడనే రాక్షసుడు మునివృత్తితో సాధువుగా జీవిస్తుంటే, సీతాపహరణకు అతని సహాయాన్ని కోరాడు. మారీచుడు ఎంత బోధించినా రావణునికి తలకెక్కలేదు. రాక్షసులు మాయారూపులు కనుక మాయా మృగ రూపంలో సీతాపహరణానికి సహాయం చేయమని రావణుడు మారీచుడిని నిర్బంధించాడు. మాయా పూరితమైన బంగారు జింకరూపంలో వచ్చాడు మారీచుడు. అది చూసి సీతమ్మ సంబరపడి రాముడిని తనకు ఆ జింక కావాలని తెచ్చిపెట్టమని అడిగింది. రాముడు తాను లేనప్పుడు వదినను జాగ్రత్తగా చూసుకోమని చెప్పి ఆ జింక వెంట వెళ్ళాడు.

మారీచుడు రాముని చేతిలో మరణించడం తన మహద్భాగ్యంగా భావించాడు. శ్రీరాముని బాణానికి గురైన మారీచుడు మరణించేటప్పుడు రామచంద్రుని కంఠ ధ్వనిని అనుకరిస్తూ 'హా లక్ష్మణా! హా సీతా!' అని అరిచాడు. ఆ ఆర్తనాదం వినబడగానే నారీ సహజమైన బేలతనంతో సీత లక్ష్మణుని వెంటనే వెళ్ళి సోదరుడిని రక్షించమని అడిగింది. అదంతా రాక్షస మాయ. రామునకెట్టి ప్రమాదం జరగదు అని వదినమ్మను ఎంత వారించినా సరే సీతమ్మ విధి బలీయమైన కారణంతో లక్ష్మణుని ఎన్నో పరుష వాక్యాలతో నిందించింది. లక్ష్మణ స్వామి ఎంత చెప్పినా వినకుండా తాను కలలో కూడా లక్ష్మణుని వూహించనని నిందా వాక్యాలతో అతనిని ఖిన్నుణ్ణి చేసింది. అన్నమాట అతిక్రమిస్తున్నాననే బాధ ఒకవైపు, ఎన్నడూ లేని విధంగా వదినగారి నిందలు ఒకవైపు మనస్సు కుంచించుకుపోయి బయలుదేరాడు. వెళ్ళేముందు లక్ష్మణుడు పర్ణశాల ముందు ఒక రేఖ గీసి, ఎవరొచ్చినా, ఎట్టి పరిస్థితులలో కూడా ఆ గీత దాటి ఇవతలకు రావద్దని చెప్పి, విధిలేక విడిచి వెళ్ళాడు.

- సశేషం

# శ్రీశ్రీశ్రీ బాబూజీ మహరాజ్‌వారితో

(గత సంచిక తరువాయి) **అనుభవాలు** -వి. లక్ష్మీ నరసమాంబ

నేను ఆశ్చర్యంతో తలక్రిందులయ్యాను. నాకు అంతకుముందే ఆ గాంధేయవాది నా శ్రమ, విలువైన కాలం, నా సామర్థ్యం ఆ పుస్తకం తయారీకి బాగా ఉపయోగించుకుని, దాని వలన కలిగే 'పేరు' ఆయనకు మాత్రమే దక్కేటట్లుగా ఆలోచన చేస్తున్నాడా? అని అనుమానంగా వుంది. బాబూజీబోధతో అనుమానం నివృత్తి అయింది. ఆ ప్రముఖునికి 'నాకు విజయవాడలో వుండటం వీలుపడదు' అని వర్తమానం పంపాను.

అలా బాబూజీ నాకు ఎప్పటికప్పుడు మార్గదర్శకత్వం చేస్తూ వచ్చారు.

**బాబుగారు - డ్రైవరు రెడ్డి**

నేను మొదట్లో అమీర్‌పేట నుండి ఆశ్రమానికి ఆటోలో వచ్చి వెడుతూ వుండేదాన్ని. అలా కొన్నాళ్ళు గడిచాక, మా కుటుంబం జుబ్లీహిల్స్‌లోని మా అబ్బాయి ఫ్లాట్‌కి మారాము. ఉన్నది ముగ్గురం కొడుకు కోడలు, నేను. వారిని వదిలి నేను ఒక్కదాన్ని అమీర్‌పేటలో ఎలా వుండగలను? కానీ, ఆ ఇల్లు జుబ్లీహిల్స్‌లోని మెయిన్ రోడ్డుకి రెండు కిలోమీటర్ల లోపలికే వుండేది. ఏ ఆటోవాడైనా, రాత్రి 9గం.లకు సత్సంగ సమావేశం ముగిశాక, జుబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకూ వచ్చేవాడు. ఆ తరువాత రానని మొరాయించేవాడు. ఎంత దూరం లోపలికి పోవాలో సరిగా తెలియనందు వలన నన్ను విసుక్కుంటూ ఇంటి దగ్గర వదిలేవాడు. అక్కడకి బస్సు సౌకర్యం కూడా తక్కువే. అటువంటి పరిస్థితులలో నేను రాత్రిపూట ఆశ్రమం నుండి ఇల్లు చేరడం ఎలా? అని నేను మధన పడుతూ వుంటే, ఇంట్లోకి మనవడు రావడం, వాడి స్కూల్‌కోసం, నా కోసం, మా వాళ్ళు ఇంకొక కారు కొని, దానికి ఒక డ్రైవర్‌ని పెట్టడం జరిగింది. ఈ ఏర్పాటు నాకు ఆశ్రమానికే కాదు, అమీర్‌పేట నుండి ఇంటి పనులకు, బ్యాంక్, ఆఫీస్ పనులకు బయటకు వెళ్ళడానికి చాలా సౌకర్యంగా వుంది. బాబుగారే నాకు కారు, డ్రైవర్ ఏర్పాటు

చేసి, నేను తమ దర్శనానికి సులభంగా రావడానికి వీలు కల్పించారు అనుకున్నాను.

ఆ కారు నడిపే డ్రైవర్ పేరు రెడ్డి. లచ్చిరెడ్డి. అతనికి కొన్ని కారణాల వలన వివాహం కావడం లేట్ అయింది. ఇంటి దగ్గర ఆస్తీపాస్తీ వున్నా, అన్నింటికీ దూరంగా హైదరాబాద్‌లో డ్రైవర్‌గా జీవితం గడపవలసి వచ్చింది. అందువలన అతడు ఎప్పుడూ దిగులుగా వుండేవాడు. నాతోపాటు ఆశ్రమానికి వచ్చి, వెనుకగా కూర్చునేవాడు. అలా ఒక ఏడాది గడిచింది.

అతని జీవితంలో పెద్దగా మార్పు రాలేదు. ఒకటి రెండు సంబంధాలు కుదిరినట్లే కుదిరి వెనక్కి వెళ్ళి పోయాయి. ఆ పరిస్థితులలో ......

'ఈ ఉద్యోగం ఎందుకు? ఈ సంపాదన దేనికి? జీవితానికి అర్థం పర్థం లేకుండా పోయింది. గుంటూరు ఆశ్రమానికిపోయి అక్కడే అమ్మగారికి డ్రైవర్‌గా బ్రతికితే మనశ్శాంతిగా వుంటుంది' అనే ఆలోచన చేయసాగాడు. నేను 'నాకు రాత్రిపూట ఇంటికి తీసుకుపోయే డ్రైవర్ మరొకతను దొరుకుతాడా?' అని అనుకునేదాన్ని.

ఇలా అనుకుంటుండగా అతనికి చటుక్కున పెళ్ళి కావడం, సంసారం ఏర్పాటు కావడం అన్నీ జరిగిపోయాయి. మొదట్లో భార్యాభర్తలిద్దరికీ సర్దుబాటు విషయంలో కొన్ని చికాకులు వచ్చినా, క్రమంగా ఇద్దరూ సుఖంగా కాపురం చేసుకుంటున్నారు. వారికి ఇద్దరు మగ పిల్లలు. రెడ్డి బాబుగారి యందు తన విశ్వాసాన్ని కొనసాగిస్తూనే వున్నాడు. రెండవ కొడుక్కి మాతాజీగారే కాళీప్రసాద్ అని నామకరణం చేశారు.

ఒకసారి రెడ్డి పెద్దకొడుకు సునీల్‌కి నాలుగేండ్ల వయస్సులో డెంగూ వచ్చింది. అది డాక్టర్లు చూడగానే కనిపెట్టారు. వెంటనే సరియైన చికిత్స చేశారు. రెడ్డి దిగులు పడ్డాడు. బాబుగారికి గట్టిగా మొక్కుకున్నాడు. డాక్టర్ వైద్యం పనిచేసి, వారం రోజుల్లో పిల్లవాడు కోలుకున్నాడు.

రెడ్డి బాబుగారి సేవ, మా ఇంట్లో ఉద్యోగం రెండూ కొనసాగిస్తున్నాడు.

- సశేషం


వైరాగ్యం?
మధుప
ఏమండీ! ఒక్కరోజు టైముకి ఇంటికి రారు. తెమ్మన్న సరుకులు తీసుకురారు. ఆమాత్రం బాధ్యత లేనివారు పెళ్ళి ఎందుకు చేసుకున్నట్టు?
1
కనీసం నాకు ఇప్పటివరకు ఒక్క నగ అయినా కొని పెట్టారా?
నాన్నా! ఇవాళ కూడా నాకు బొమ్మలు తేలేదా?
2


ఛీ! ఈ సంసారమే కష్టాలమయం. రేపే నేను సన్యాసం తీసుకుంటాను!
3


హమ్మయ్య! ఈ పెళ్ళాం పిల్లల బాధ తప్పింది. ఇక హాయిగా తపస్సు చేసుకుంటాను.
4


చాలా ఆకలేస్తోంది!
ఎవరైనా ఇటుగా వచ్చి
నాకు ఏదైనా పెడితే
బాగుండును.
5


ఇంట్లో ఉంటే మా
ఆవిడ ఎన్ని తిట్టినా
టైముకి కడుపు నిండా
భోజనం అయినా
పెట్టేది.
6


మా ఆవిడా, కూతురూ నన్ను ఎంతగా మిస్ అవుతున్నారో ఏమో! ఎందుకొచ్చిన సన్యాసం? హాయిగా ఇంటికే పోదాం!
7


వైరాగ్యం అనేది భగవంతుని మీద భక్తితో, ప్రపంచం అశాశ్వతమనే దృఢమైన జ్ఞానంతో కలగాలి కానీ పెళ్ళాం గయ్యాళిదనో, అప్పులవాళ్ళ బాధ భరించలేకో క్షణికావేశంలో కలిగిన వైరాగ్యం ఇలాగే ఉంటుంది.
8

# ఈశ్వరుడు

-పాలూరి కాళీప్రసాద్

**ఈశ్వరో గురురాత్మేతి మూర్తిభేద విభాగినే వ్యోమవద్వ్యాప్త దేహాయ దక్షిణామూర్తయే నమః**

ఈశ్వరుడికి, గురువుకి, ఆత్మకు రూపంలో భేదం తప్ప, అసలు వస్తువులో భేదం లేదని, ఆకాశం ఎలాగైతే సర్వవ్యాపకమై వున్నదో, అలాగే ఈశ్వరుడు కూడా సర్వవ్యాపకుడని ఈ దక్షిణామూర్తి స్తోత్ర శ్లోకం వివరిస్తోంది. ఇలా మూడు రూపాలలో వుంటూ మనకు బాగా తెలిసిన వస్తువు నీరు. నీటి ఆవిరి, లేదా తేమ రూపంలో మన చుట్టూ వున్న గాలి అంతటా వ్యాపించి వుంటుంది నీరు. దీనికి ఒక రూపం లేదు. అలాగే ద్రవ రూపంలో మనం నిత్యం వుపయోగించుకునే నీరు ఒక రూపంలో కనిపిస్తుంది కానీ, ఒక నిర్దుష్టమైన ఆకారం లేకుండా అది ఏ పాత్రలో ప్రవేశిస్తే ఆ పాత్ర ఆకారాన్ని తాను పొందుతూ వుంటుంది. అదే నీరు ఘనీభవించి మంచుగడ్డగా మారినప్పుడు తనకంటూ ఒక ఆకారాన్ని సంతరించుకుంటుంది.

ఈశ్వరుడు కూడా ఆ నీటి ఆవిరి లాగే సర్వవ్యాపకుడైనప్పటికీ మన కంటికి కనిపించకుండా వుంటాడు. అదే ఈశ్వరుడు ఆత్మ రూపాన్ని పొందినప్పుడు ఏ ప్రాణి శరీరంలో ప్రవేశిస్తే ఆ ప్రాణి ఆకారాన్ని పొంది దానిలో చైతన్యాన్ని నింపి నడిపిస్తూ వుంటాడు. అయితే ఈ రెండు రూపాలూ కూడా ఇంద్రియాలకు అగోచరమైనవే. మరి ఆ ఈశ్వరుని, లేదా ఆత్మను తెలుసుకోవడం ఎలా? నిజంగా అలా తెలుసుకోవాలన్న ఆవేదన తీవ్రతరమైనప్పుడు ఆ భక్తుని భక్తిని సిద్ధింపజేయటానికై అదే ఈశ్వరుడు ఘనీభవించిన రూపంలో ఒక గురువుగా మన ముందు ప్రత్యక్షమవుతాడు. **అప్రత్యక్షో మహాదేవః సర్వేషాం ఆత్మమాయయా ప్రత్యక్షో గురురూపేణ వర్తతే భక్తి సిద్ధయే.**

నీరు వాతావరణంలోని మార్పులకు చాలా త్వరగా వేడెక్కిపోతూ వుంటుంది. అలాగే మనందరిలో వున్న ఆత్మ సంసార తాపత్రయ స్పర్శ చేత ఆవేదనకు గురవుతూ వుంటుంది. మన చిన్నప్పుడు వేసవి కాలంలో ఏదైనా పెద్ద కార్యక్రమాలు చేసేటప్పుడు మంచినీళ్ళ పాత్రలలో మంచు

గడ్డలు వేసేవారు. ఆ మంచుగడ్డ తాను ఎప్పుడూ చల్లగా వుండటమే కాకుండా తన సాన్నిహిత్యంతో ఆ నీటిని కూడా చల్లగా చేస్తుంది. ఆ మంచుగడ్డ త్వరగా కరిగిపోయినా కూడా నీటిలో ఆ చల్లదనం చాలా కాలం నిలిచి వుంటుంది. అలాగే ఒక మహత్తరమైన ప్రయోజనం కొరకు ఆకారాన్ని ధరించి వచ్చిన గురువులు ఈ సంసార తాపత్రయంలో వుంటూ కూడా తాము నిశ్చలమైన ప్రశాంతతను అనుభవించడమే కాకుండా తమను ఆశ్రయించిన వారందరి మనస్సులనూ అటువంటి ప్రశాంతతో నింపివేస్తారు. తమ అవతార ప్రయోజనం నెరవేరగానే ఆ గురువుల రూపం కనుమరుగైనా వారి బోధల నుండి ప్రసరించిన ప్రశాంతత చిరకాలం అనేక జీవాత్మలకు శాంతిని ప్రసాదిస్తూనే వుంటుంది.

**ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశే஽ర్జున తిష్ఠతి** - అర్జునా! ఈశ్వరుడు సర్వభూతాల హృదయాలలో స్థిరనివాసియై వుంటాడు అని గీతాచార్యుడు ప్రవచించాడు. అయితే మనం ఈ హృదయంలోకి చూడటం అలవాటు చేసుకోవాలి. మన మనస్సు నిరంతరం బయటి విషయాదులవెంటే పరుగులు పెడుతూ వుంటుంది. తాను అనుకున్నది పొందటం కోసం పెద్ద పెద్ద ప్రణాళికలు వేస్తూ వుంటుంది. అది జరిగితే ఆనందిస్తుంది. ఏమాత్రం తేడా వచ్చినా కృంగిపోతుంది. దీనికి కారణం కూడా అదే శ్లోకంలో పరమాత్మ చెబుతున్నాడు. **భ్రామయన్ సర్వ భూతాని యంత్రారూఢాని మాయయా** - ఆ ఈశ్వరుడు ఊరికే హృదయంలో కూర్చోకుండా ఆ యా జీవులను తన మాయ అనే యంత్రంలో వేసి గిరగిరా త్రిప్పుతూ వుంటాడు.

సాక్షాత్ ఈశ్వరాంశయైన ఆంజనేయ స్వామి కూడా సీతాన్వేషణలో ఇలాగే లంకంతా గాలించినా అమ్మ కనబడక 'ఇప్పుడు నేను అమ్మను చూడకుండా తిరిగి వెడితే రాముడు మరణిస్తాడు, లక్ష్మణుడు మరణిస్తాడు, సుగ్రీవుడు మరణిస్తాడు, అయోధ్యలో ఇంకా కిష్కింధలో వున్నవారందరూ మరణిస్తారు' ఇలా చాలా చాలా దూరాలోచనలోకి వెళ్ళిపోతాడు. మనస్సు ప్రవర్తన ఇలాగే వుంటుంది. అయితే ఆయన స్థితప్రజ్ఞుడు కాబట్టి ఒక్కసారి తన మనస్సును కట్టడి చేసి, తన హృదయంలోకి చూసుకుంటాడు. అక్కడ ప్రకాశిస్తున్న సీతారాముల దర్శనం కాగానే వారిని ప్రార్థించడం, వెంటనే ఆయనకు

అశోకవనం, అందులో సీతాదేవి ప్రత్యక్ష దర్శనం కలగటం జరిగిపోతాయి.

గురుదేవులు శ్రీ బాబూజీ మహరాజ్‌వారు కూడా 'నేను మీ హృదయబాబును' అనేవారు. మనం సమస్యలలో చిక్కుకుని ఎటూ నిర్ణయించుకోలేని ద్వైదీ భావనలో మనస్సు అశాంతిని పొందినప్పుడు నిరాకారంగా వుండే ఈశ్వరుని దర్శించలేక పోయినా, సాకారంగా వచ్చిన గురుదేవుల రూపం కనుమరుగైనా మనస్సును ప్రక్కన పెట్టి, మన హృదయ క్షేత్రంలో నిరంతరం ప్రకాశించే ఈశ్వరుని మాట వినగలిగితే అంతులేని ప్రశాంతత మన స్వంతమవుతుంది. అదే అసలైన శివరాత్రి!

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**మార్చి 2021**

8 సోమ - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

11గురు - మహాశివరాత్రి - ఉ॥ 11గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

28 ఆది - పౌర్ణమి - హోళీ - ఉ॥ 11గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

**ఏప్రియల్ 2021**

6 మంగళ - శ్రీగురుదశమి. సా॥5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

13 మంగళ - శ్రీ ప్లవ నామ సంవత్సర ఉగాది. ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

21 బుధ - శ్రీరామనవమి సా॥5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

27 మంగళ - చైత్ర పౌర్ణమి - సా॥5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

# మధురం మధురం మధురం

(గత సంచిక తరువాయి)

- విజయ రాఘవీయం

అందరి మాటలు విన్న శ్రీరాముడు 'ఎవరైనా సరే, అతను నాకు పరమ శత్రువైనా, లేక నాకు అపకారం తలపెట్టినవాడైనా సరే, నా ఎదుటికి వచ్చి శరణు అంటే ఇక్ష్వాకు వంశస్థుడనైన నేను క్షాత్ర ధర్మాన్ని అనుసరించి అతనికి తప్పనిసరిగా శరణు అనుగ్రహిస్తాను. ఇది నా శపథం' అని తన నిర్ణయాన్ని చెబుతాడు. అదీ శ్రీరాముడి నిష్ఠ, సత్యసంధత, మరియు శరణు కోరిన వారియెడల ఆర్ద్రత, వారికి శరణిచ్చేటటువంటి సత్యపరాక్రమత.

అరణ్యవాసం తరువాత తన పట్టాభిషేక సమయంలో రాక్షసరాజైన విభీషణుని, వానరరాజైన సుగ్రీవుణ్ణి, కిరాతరాజైన గుహుణ్ణి అందరినీ సమదృష్టితో చూసి, సముచితరీతిలో వారందరినీ సత్కరించి, గౌరవించినవాడు శ్రీరాముడు. అలాగే పట్టాభిషేకం అయిన కొద్దిరోజుల పిదప తనకోసం వచ్చినవారందరినీ తిరిగి వారివారి ఇండ్లకు సాగనంప వలసివచ్చినప్పుడు కూడా వారికి తగురీతిలో బహుమతులిచ్చి, సాదరంగా వీడ్కోలు పలుకుతాడు. ఎవరినీ మరచిపోలేదు. తన మామగారైన జనకమహారాజును, తన తండ్రికి మామగారైన కైకేయి రాజు మొదలగు తనకు ప్రత్యక్షంగాకానీ, పరోక్షంగా కాని సహాయం చేసి, తన పట్టాభిషేకం కోసమై అయోధ్యకు వచ్చిన వారందరికీ పేరుపేరునా బహుమతులిచ్చి సత్కరించిన మహానుభావుడు శ్రీరామచంద్రుడు. ఇది ఆయన సమదృష్టికి ఒక నిదర్శనం.

నారాయణుడైనా కూడా నరునిగా సంచరించి మానవధర్మం నెరపి, మానవుడు ప్రపంచంలో నడుచుకోవలసిన రీతిని మనకందరికీ తెలియజెప్పిన మహావతారుడు శ్రీరాముడు. ఆయన సత్యవాక్పరిపాలకుడు, సత్యపరాక్రముడు. ఇవేవీ శ్రీరాముడు కావాలని నేర్చుకున్న గుణాలు కావు. ఆయనకు సహజంగానే వున్న లక్షణాలు. శ్రీరాముణ్ణి మనం చూడలేదు. కానీ, రామచరితం వింటున్నా, చదువుతున్నా మనకి ఒక అలౌకిక ఆనందం కలుగుతుంది. అంతేకాదు. మనకు ఈ లక్షణాలు సుపరిచితమే అన్నట్లు, అంటే ఎక్కడో చూసినట్లు, సాక్షాత్ శ్రీరామునే చూసినట్లు అనుభూతి కలుగుతుంది.

నిజమే మరి, ఆ శ్రీరాముడు ఎవరో మనకు పరిచయం చేసి, ఆయన గుణగణాలు తెలిపి పరమాత్మ తత్త్వమును అనుభూతిని కలిగించి, తానే స్వయంగా అలా నడచి, తనకు శ్రీరామునకు భేదం లేదని నమ్మిన వారికి శ్రీరామునిగా దర్శనమిచ్చిన మన స్వామి శ్రీబాబును మనం చూడలేదా? బాబు మాటలలో మృదు మధురత్వం, సత్యం, అపారమైన కృప కనలేదా? వినలేదా? ఎదుటివారిని నొప్పించే మాటలు వారినోట ఎన్నడైనా విన్నామా?

ఒకసారి శ్రీబాబు దర్శనార్థం నేను బొంబాయి నుండి మన ఆశ్రమానికి రావడం జరిగింది. అవి ధనుర్మాసం రోజులు. చెట్టు క్రింద సంకీర్తన జరుగుతోంది. స్వామి ఎవరితోనో మాట్లాడుతూ వాకింగ్ చేస్తున్నారు. సాధారణంగా నంబూరు ప్రయాణం బాబు దర్శనం, నమస్కారం కొరకే. నమస్కారం చేసుకుంటుంటే ఆయన ఎలాగో పలుకరిస్తారు. సంభాషణ కూడా అయిపోతుంది. ఇక వెంటనే ఇంటికి తిరిగి వెళ్ళిపోవడమే. ఇదే నా పద్ధతి అప్పట్లో. అంటే కావాలని నేను అలా చేయడం కాదు, అనుకోకుండా నాకు అలాగే జరిగిపోయేది. బాబు దర్శనం కూడా త్వరగానే జరిగిపోయేది.

ఆ రోజు అలాగే ఊహించుకుంటూ రామాలయం ద్వారం దగ్గర ఆయన దర్శనం కోసం వేచిచూస్తూ నిలబడి వున్నాను. ఇక్కడ సంకీర్తన జరుగుతుంటే కాసేపటికి తలుపులు తెరచి, బాబు బయటకు వస్తున్నారు. నేను గబగబా ఎదురు వెళ్ళి బాబుకు నమస్కారం చేసుకోబోయాను. బాబు సీరియస్‌గా చూశారు. వెంటనే ప్రక్కన వున్నవాళ్ళు నన్ను ప్రక్కకు లాగేశారు. నాకు ఏడుపు వచ్చేసింది. శ్రీబాబు నేరుగా ధనుర్మాసం చెట్టు క్రిందకు వెళ్ళి తమ సింహాసనంలో ఆసీనులయ్యారు. నేనూ వెళ్ళి అందరితోపాటు కూర్చున్నా కనుల నిండుగా నీరుతో. కాసేపటికి స్వామి అందరికీ నమస్కారాలు ఇస్తున్నారు. నేను నమస్కారం చేసుకుందామని సాష్టాంగపడి రెండు చేతులతో పాదాలు గట్టిగా పట్టుకుని తలెత్తి స్వామి వంక చూస్తున్నాను. నా కళ్ళల్లో నీళ్ళు అలాగే వున్నాయి. బాబు అభయహస్తంతో నన్ను ఆశీర్వదిస్తూ ముందుకు వంగి, నా కళ్ళల్లోకి సూటిగా చూస్తూ 'ఓం....' అంటూ ఆశీర్వదించి, నన్ను ఓం అని అనుకోమన్నారు. వెంటనే నాకు ఉపశమనం కలిగింది.

- సశేషం

(గత సంచిక తరువాయి) # శ్రీకృష్ణ జన్మాష్టమి -సుషమ్నా ప్రసాద

శ్రీకృష్ణ పరమాత్మకు మించిన రాజకీయ చతురుడు, రాజనీతిజ్ఞుడు మరొకరు లేరు. కురుక్షేత్ర సంగ్రామాన్ని విజయపథంలో నడిపించడానికి మూల పురుషుడు కృష్ణపరమాత్ముడే. అంతేకాదు తన యందు అచంచల విశ్వాసంతో, భక్తి పారవశ్యంతో తానే తమ సర్వస్వమని నమ్మిన సర్వశ్రేష్ఠ ధనుర్ధారియైన ధనుంజయుని, పాండవులను ధీరోదాత్తులను చేసిన ధీశాలి, ప్రజ్ఞాశాలి కృష్ణ భగవానుడు.

అన్నిటి కంటే కృష్ణభగవానుడు మానవాళికి ప్రసాదించిన మకుటాయమానమైన అమూల్య వరం గీతాచార్యునిగా జగద్గురువుగా ప్రసాదించిన భగవద్గీత. గీతోపదేశము పార్థుని నిమిత్తమాత్రుడైన గోవత్సంగా చేసి, సర్వోపనిషత్ సారమనే గోక్షీరమును ధీశాలురు, మోక్షకాములు అయిన సర్వమానవాళికి ప్రసాదించిన అభయప్రదాత కృష్ణ భగవానుడు.

జాతి, మత, కుల భేదములకతీతమైన జాతిరత్నము భవగద్గీత. కాలము, మతము, దేశమనే హద్దులను అతిక్రమించి, తన్ను తానెరిగిన వాని రాతను భగవద్గీత మారుస్తుందనే నిత్యసత్యమును ప్రబోధించిన ప్రజ్ఞాశాలి గీతాచార్యుడు. కర్తవ్య విముఖుడు కాకుండా, నిష్కామకర్మ చేసి, నిత్యానందమునకు శాశ్వతవారసుడవు కాగలవని అభయమిచ్చిన అభయ ప్రదాత గీతాచార్యుడు.

రణ భూమిలో మరణ విజేత ఎలా కావాలో కురుక్షేత్ర సంగ్రామంలో ఉభయసేనల మధ్య నిలచిన పాండవ మధ్యముని మమకారమును మసిచేసి, కర్తవ్య విముఖుడు కాకుండా, నిష్కామకర్మకు నీరాజనమిప్పించి, యుగయుగాలకు, తరతరాలకు విశ్వవిజేతగా నిలబెట్టి, విజయుడనే నామధేయమునకు సార్థకతను ప్రసాదించాడు. సర్వోపనిషత్సారమును సర్వమానవాళికి ప్రసాదించి, జీవిత సమరంలోనే విజేతలగుటకు ప్రోత్సహించింది గీతా తత్త్వము, గీతాసారము. అలాంటి అపరూపమైన భగవద్గీతను మానవాళికి మహత్తరమైన కానుకగా ప్రసాదించి, తరింపజేసిన మహిమాన్వితుడైన ప్రేమావతారము శ్రీకృష్ణావతారము. జగన్నాథుడై, జగత్తును సంరక్షించే,

ఆ జగద్గురువుకు త్రికరణ శుద్ధిగా ప్రణమిల్లడం తప్ప మనమివ్వగల కానుక మరేమున్నది? అలా కృష్ణపక్షమున అష్టమినాడు ప్రభవించి మనకు అష్టైశ్వర్యములను ప్రసాదించే జగన్మోహనునకు కృష్ణం వందే జగద్గురుం అని ప్రణమిల్లడమే మనమివ్వగలిగిన జన్మాష్టమి కానుక!

---

## పెదనింద్రకాలను శాఖలో కార్యక్రమాలు

*** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

**మార్చి 2021**

8 సోమ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

11 గురు - మహాశివరాత్రి - సద్గురుపాదపూజ, భక్తసమారాధన.

28 ఆది - పౌర్ణమి - హోళీ - శ్రీసద్గురుపాదపూజ.

**ఏప్రియల్ 2021**

6 మంగళ - శ్రీ గురుదశమి - శ్రీసద్గురుపాదపూజ

13 మంగళ - శ్రీ ప్లవనామ సంవత్సర ఉగాది - శ్రీసద్గురుపాదపూజ.

21 బుధ - శ్రీరామ నవమి - శ్రీసద్గురుపాదపూజ.

27 మంగళ - చైత్ర పౌర్ణమి - శ్రీ సద్గురుపాదపూజ.

## ప్రకటన

శ్రీ సనాతన ఋషి విద్యాలయం ద్వారా పరమ పూజ్య పాద శ్రీశ్రీశ్రీ స్వస్వరూపానందగిరి స్వాములవారు (శ్రీ వశిష్ఠాశ్రమము, శ్రీ లలితాపీఠ సంస్థాపకులు) మరియు పరమ పూజ్య పాద శ్రీశ్రీశ్రీ ప్రకాశానంద సరస్వతీ స్వామి (ఆర్షవిద్యా గురుకులం, కోయంబత్తూరు) వారల పర్యవేక్షణలో **వేదాంత విజ్ఞాన శిక్షణా తరగతులు** శ్రీ వశిష్ఠాశ్రమంలో (శ్రీనివాస మంగాపురం, తిరుపతి) 24-7-2021 నుండి 24-1-2022 వరకు జరుగును. 15 నుండి 35 సం॥ల మధ్య వయస్కులు, అవివాహితులు, బ్రహ్మచారిణీ/బ్రహ్మచారులకు మరియు సన్యాసినీ, సన్యాసులకు అవకాశము కలదు. వీరికి భోజన వసతి, వస్త్ర, విద్యా సాధనములు, సాధారణ వైద్య సౌకర్యములు సంస్థ తరపున ఏర్పాటు చేయబడును. 35సం॥లు దాటినవారు మరియు వానప్రస్థులు చేరదలచినచో 6నెలలకు 25,000 రూ॥లు ముందుగానే చెల్లించ వలెను. పూర్తి వివరములకు సెల్ 94404 86392; 94260 09812; 97692 61479 సంప్రదించవలెను.

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

ఎవరి ఋణమైనా తీర్చుకోగలం కానీ, గురు ఋణం మాత్రం తీర్చుకోలేము. ఒకసారి కొంతమంది భక్తులతో కలసి శ్రీబాబు కేదార్ యాత్రకు వెళ్ళడం జరిగింది. అందులో ఒక భక్తుడు ఇక నేను నడవలేను, డోలీ అయినా ఎక్కించండి అంటూ, ఆకలి వేస్తోంది అంటూ వుంటే, గురుదేవులు 'ఇదిగో! వచ్చేశాం. ఇంక కొంచెం దూరమే వుంది కొండపైకి అంటూ నడిపించేసి, ఉపవాసం చేయించారు. ఆనాడు ఏకాదశి కూడా అయింది. ఆ భక్తుడు ఎలాగో తనంతటతాను ఉపవాసం చేయలేడు. తన శక్తి మీద తనకే నమ్మకం లేదు. కానీ గురుదేవులు మనచేత ఆవిధంగా సాధన చేయించి, భగవంతుడిని పొందేటట్లు చేస్తారు.

నిన్ను నీవే నమ్మవు నీవెవరిని నమ్మగలవు నిలకడే లేని మనసా - భగవంతుడి దగ్గర కూర్చున్నా ఈ నిలకడ లేని మనస్సు ఎన్నో ప్లాన్లు పెద్ద పెద్ద సైంటిస్ట్‌లను కూడా మించి వేస్తుంది. నిన్న జరిగినదాన్ని గురించి, రేపు చేయబోయేదాన్ని గురించి ఆలోచిస్తూ వుంటుంది మనస్సు. మరి ఇవాళ్టి సంగతి ఏమిటి? మరి ఇవాళ సాధన శ్రద్ధగా చేస్తే నిన్నటిది పునీతమవుతుంది, రేపటిది కూడా తరించి తీరుతుంది. ఒక మొక్క పాతితే, ముందు దాని మంచిచెడులు చూసుకోవాలి. వేరుకి పురుగు పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పుడున్న నీ పరిస్థితి ఏమిటి? ఈ సమయం నీ చేయి జారిపోకుండా చూసుకోవాలి. ఈ అవకాశం కూడా జారిపోతే, ఇవాళ కూడా నిన్నటిలాగా అయిపోతుంది కదా. అందుకనే జాగ్రత్త పడాలి.

శిష్యుడు ఏం చేయాలంటే గురువాక్యాన్ని కేవలం బుద్ధితో గ్రహించి స్వీకరిస్తే చాలదు. అతడు ఆత్మ తత్వాన్ని అంతరంగంతో ఆత్మీయంగా అనుభవించాలి. అంటే అభిన్నంగా - **గురోరన్యం న భావయేత్** అన్నట్లుగా ఇక్కడ శిష్యుడు అశ్వలాయన మహర్షి, గురువు బ్రహ్మదేవుడు. గురువు చెప్పిన విషయం కేవలం బుద్ధితో మాత్రమే గ్రహిస్తే చాలదు. ఆత్మీయతతో అభిన్నంగా అనుభవించాలి. ప్రపంచంలో తల్లీపిల్లల సంబంధం ఎలా వుంటుందంటే చిన్నప్పుడు ఎత్తుకుని అసలు వదిలిపెట్టను అనుకుంటుంది తల్లి. పెద్దవుతున్న కొద్దీ ఈ పిల్లవాడు తల్లిదండ్రులకు దూరం అవుతాడు. ఎందుకంటే అక్కడ ధర్మం ప్రకారం

వాళ్ళ దగ్గరే వుంటాను అనుకుంటే కుదరదు, వారికి దూరం అవుతాడు. కానీ గురువుల దగ్గర దీనికి వ్యతిరేకంగా వుంటుంది. గురువు అనుగ్రహిస్తేనే మనం తత్వానికి రోజురోజుకూ దగ్గర అవుతాము.

ముందర లక్ష్యార్థం తీసుకున్నప్పుడు 'నేను ధ్యానం చేసుకుంటున్నాను' అనే గుర్తు వుంటుంది. ధ్యానం చేయగా చేయగా ధ్యానంలో వున్న లక్ష్యార్థాన్ని మనం ఏకాగ్రతతో సేవించగా, మననం చేయగా చేయగా, ఆ లక్ష్యార్థ స్వరూపాన్ని 'తాను' అనుభవిస్తున్నాడు. అప్పుడది ఒకటా రెండా అంటే అక్కడ ఒక్కటే వుంది. మెల్లగా ధ్యానంలో అడుగు పెడుతున్నాము. ధ్యానం చేస్తున్నంతసేపూ అక్కడ ఒకటే అనుభవిస్తున్నాడు. గురుబోధా శ్రవణం చేస్తున్నాం. తరువాత మనం మననం చేసుకుంటూవుంటే ఏకాకార వృత్తికి తీసుకువెడుతుంది. ఇది శరీరానికి సంబంధించినది కాదు. రెండు శరీరాలు అతుక్కుని పుట్టవచ్చు. ఆపరేషన్ చేసి విడదీయ వచ్చు, లేదా విడదీయ లేకపోవచ్చు. ఆత్మ తత్వం తెలిసికొన్నవారికి, ఉపాధి లోపల వున్నది అని గుర్తించినవారికి, అనుభవించినవారికి ఒకటే వుంటుంది. ఆ స్థితిలో రెండు వుండటానికి వీలులేదు. రెండు ఉపాధులను అతకలేంకానీ, ఆ రెండు శరీరాలలో వున్నది ఒకే ఆత్మతత్వం. అందువల్ల ఆత్మతత్వాన్ని ఆత్మీయంగా, అభిన్నంగా అనుభవించాలి. నాది ఆత్మతత్వం అనే భావన కలిగి వుండాలి. ఎవరి ఆకలి వారికే , ఎవరి కడుపు నిండటం వారికే తెలుస్తుంది. ఇంకొకరికి తెలియదు.

ఇప్పుడు మనం చేసుకునే విచారణ కనిపిస్తోంది; ఎలా అయితే మనకి ఆకలి వేసినప్పుడు లోపలికి వెళ్ళే ప్రసాదమో, అన్నమో కనిపిస్తుందో అలాగ. మనసులో ఎంత ఆవేదనవుందో అది మనకు, మన గురువులకు ఎరుక. గురువులు మనతో విచారణ అనే రాపిడి పెడుతూ వుంటారు. అప్పుడు మనం వెళ్ళమనకుండానే మన మనస్సు ఎక్కడకు వెళ్ళాలో అక్కడికి వెళ్ళి కూర్చుంటుంది. శ్రవణం చేసినదానిని ఏ మనసు అయితే మననం చేస్తుందో అప్పుడది నిదిధ్యాసయై కూర్చుంటుంది. అదే జీవబ్రహ్మైక్య అనుసంధానం. ఆ స్థితి చచ్చిపోయిన తరువాత వచ్చేది కాదు. బ్రతికి వుండగానే జీవత్వాన్ని నశింపజేసుకుని, మనలో వున్న శివత్వాన్ని మంగళ ప్రదమైన అనుభవాన్ని మనం పొందగలగాలి.

-సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**మార్చి 2021**

8 సోమ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

11గురు - మహాశివరాత్రి - తె.జా 3-30ని॥ శ్రీబాబుకు బృందావనంలో నమకచమక సహిత రుద్రాభిషేకము; 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ, 8గం. శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో సామూహిక ఏకాదశ రుద్రాభిషేకములు; మధ్యాహ్నం 12గం. సహస్రఘటాభిషేకము; లక్ష బిల్వార్చన; తీర్థప్రసాద వితరణ; భక్తసమారాధన. రాత్రి 7గం.లకు శ్రీ ఉమామహేశ్వరస్వామివారి సామూహిక కళ్యాణ మహోత్సవం; అనంతరం స్వామివారి నగరోత్సవం.

13 శని - అమావాస్య

16 మంగళ - ఫాల్గుణ శుద్ధ తదియ - శ్రీ లలితానంద సరస్వతీస్వామిని వారి ఆరాధన, సత్సంగం.

28 ఆది - పౌర్ణమి - హోళీ - శ్రీసద్గురుపాదపూజ.

**ఏప్రియల్ 2021**

6 మంగళ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

10 శని - మాస శివరాత్రి.

12 సోమ - అమావాస్య

13 మంగళ - శ్రీ ప్లవనామ సంవత్సర ఉగాది.

14 బుధ నుండి 20 మంగళ వరకు మౌనధ్యాన సప్తాహ శిబిరం.

21 బుధ - శ్రీరామ నవమి - తె॥ 5-30ని॥ శ్రీ సద్గురుపాదపూజ, ఉ. 11గం. శ్రీసీతారాముల సామూహిక కళ్యాణాలు, భక్తసమారాధన

27 మంగళ - చైత్ర పౌర్ణమి - శ్రీ సద్గురు పాదపూజ

నేనేమీ భగవంతుణ్ణి కాను, మహాత్ముణ్ణి కాను, విజ్ఞానిని కాను. మహాత్ముల దాసాను దాసుడను. మీ అందరికీ దాసుడను. జగన్మాత అందించే జ్ఞానక్షీరాలను గ్రోలే పసివాడను. ఆ తల్లి ఏది పలికిస్తే నా వాణి అదే పలుకుతుంది.

-శ్రీశ్రీశ్రీ బాబూజీ మహరాజ్

# సమర్థ సద్గురు

(యాజమాన్యం తదితర వివరాలు)

FORM - 4 ( 8వ నిబంధన ప్రకారము)

| | |
|---|---|
| ప్రచురణ స్థలం | - శ్రీ కాళీ గార్డెన్స్, నంబూరు R.S |
| ఎంత కాలానికి ఒకసారి | - మాస పత్రిక |
| ముద్రాపకుని పేరు | - సి.వి. రమణబాబు |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | - D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరుR.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| సంపాదకుని పేరు | - పాలూరి శివరామ కాళీప్రసాద్ |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | - D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరుR.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| పత్రిక యజమానులు | - యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ ఛారిటబుల్ ట్రస్ట్ D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరుR.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |

పై విషయములు నాకు తెలిసినంత వరకు వాస్తవములని తెలియజేస్తున్నాను.

శ్రీ కాళీ గార్డెన్స్ ( సం) సి. వి. రమణబాబు

దీ. 1-3-2021

# శ్రీ నృసింహ యోగీంద్రులు

(గత సంచిక తరువాయి)

- మురళి

శీతాకాలం సమీపిస్తుండగా, అవధూత స్వామి నృసింహ మూర్తిని పిలిచి, తన దగ్గర కూర్చోబెట్టుకుని, 'కుమారా! మనిద్దరిది ఎన్నో జన్మల అనుబంధం. ఈ జన్మతో తీరిపోతుంది. మేము త్వరలోనే స్వస్థానానికి చేరుకుంటాము. మా పరమ గురువులైన శ్రీ రామలాల ప్రభువులు దీనజనోద్ధరణకై ఋషీకేశ్‌లో వేంచేసి వున్నారు. వారు సర్వాధిష్ఠాన చైతన్య మూర్తి. వారిని ఆశ్రయించిన వారికి పరమపద సోపానం తప్పక లభిస్తుంది. వారు 350 సంవత్సరాల నుండి ఈ భూమి మీద విరాజిల్లుతున్నారు. నీవు వెళ్ళి ఆ స్వామిని ఆశ్రయించు. వారే నీకు మంత్రోపదేశం చేసి, మార్గదర్శకులై నీ భవిష్య కార్యక్రమాలను నిర్దేశిస్తారు. నీవు తిరిగి ఇక్కడకు రావలసిన అవసరం లేదు. శ్రీరామ్‌లాలా ప్రభువును సేవించి, తరించెదవు గాక!' అని ఆశీర్వదించారు.

నృసింహమూర్తి శ్రీ అవధూత స్వామివారి పాదములపై వాలి, 'స్వామీ! ఏమీ తెలియని నన్ను చేరదీసి, సాధనా పరంపరలో సమస్త విద్యలూ నేర్పి, ఒక స్థితికి తీసుకు వచ్చారు. తమని వదిలి వెళ్ళడమనేది నేను ఎన్నడూ ఊహించలేదు. ఈసారి తమను ప్రార్థించి, శీతాకాలంలో కూడా హరిద్వార్ వెళ్ళకుండా తమ వద్దనే వుండి పోవాలనుకున్నాను. కానీ, తమరు నన్ను తమను వదిలి వెళ్ళమని ఆదేశిస్తున్నారు. తమ ఎడబాటును సహించలేను. తమరు వున్నంతవరకూ తమతోనే వుంటాను. నన్ను అనుగ్రహించండి' అని ప్రార్థించాడు.

శ్రీ సర్వానందావధూత స్వామి నవ్వుతూ 'నేను నిష్క్రమించే సమయం చాలా దగ్గరలోనే వుంది. నీకు ముక్తిని ప్రసాదించగల గురువులు శ్రీరామలాల ప్రభువులే. ఇది భగవన్నిర్ణయం. దీనిని ఎవరూ మార్చలేరు. నీవు పరమ గురువులు రామలాలా ప్రభువులను ఆశ్రయించి వారి సేవ చేసుకుని తరించు!' అని ఆదేశించారు. ఇక నృసింహమూర్తి చేయగలిగినది ఏమీ లేక శ్రీ అవధూతస్వామికి చివరిసారిగా సాష్టాంగ ప్రణామం చేసుకుని, దుఃఖాన్ని ఆపుకుంటూ ఋషీకేశ్ ప్రయాణం అయ్యారు. అప్పటికి శ్రీ స్వామి వయస్సు 16సం॥లు మాత్రమే.

తిరిగి వచ్చిన నృసింహమూర్తిని చూసి మార్వాడీ దంపతులు ఎంతో సంతోషించారు. ఆశ్వీయుజ శుద్ధ దశమినాడు శ్రీరామలాల ప్రభువుల ఆశ్రమానికి చేరుకున్నారు నృసింహమూర్తి. అంతలోనే ఒక శిష్యుడు వచ్చి నర్సింగ్ అంటే మీరేనా అని అడిగాడు. ఆశ్చర్యపడుతూ నృసింహమూర్తి అతనిని అనుసరించి రామలాల ప్రభువుల వద్దకు వెళ్ళారు. గురుదేవులు సభలో తమ శిష్యులతో కొలువు తీరి వున్నారు. నృసింహమూర్తిని దగ్గరకు పిలిచి తన దగ్గరే కూర్చోబెట్టుకుని యోగక్షేమాలు అడిగారు. వచ్చేదారిలో అలకానదిలో పడిపోయావు కదా, దెబ్బలేమీ తగలలేదు కదా! అని అడిగారు. దానితో ప్రభువులు బ్రహ్మస్వరూపులు అని అర్థం అయింది. 'నర్సింగ్ రేపు ఉదయం 3గం.లకు స్నానాదులు ముగించుకుని నా పూజా మందిరానికి రా. నీకు మంత్రోపదేశం చేస్తాను. అప్పటి నుండి నృసింహ యోగి పేరుతో ప్రసిద్ధి చెందుతావు. నీవు ఇంకా నేర్చుకోవలసిన సాధన ప్రక్రియలు వున్నాయి. వాటిని నీకు నేర్పిస్తాను. సాధన పూర్తయిన తరువాత నీవు చేయవలసిన కార్యక్రమాలు చాలా వున్నాయి' అని ముగించారు.

మరుసటి రోజు శ్రీ రామలాలా ప్రభువులు మంత్రోపదేశం చేసిన తరువాత యోగీంద్రులు నేర్చుకోవలసిన యోగప్రక్రియలు, ధ్యాన సాధన పద్ధతులను ఒక్కొక్కటి నేర్పించారు. యోగీంద్రులు గురుసేవ చేసుకుంటూ, అనుభవంలో ఈ యోగ ప్రక్రియలన్నీ సాధనా మార్గములే, దివ్యానుభుతులు కలగాలన్నా, భగవత్సాక్షాత్కారం పొందాలన్నా సద్గురు కృప లేనిదే సాధ్యం కాదని తెలుసుకున్నారు. శిష్యులందరిలోకి చిన్నవాడైనందున అన్ని కార్య క్రమాలలోనూ గురుదేవులకు చేదోడువాదోడుగా వుంటూ, సమస్తమూ తెలుసుకోవడమే కాక, ఇతర శిష్యులకు  సాధనా క్రమంలో సలహాలిస్తూ వుండేవారు. గురుదేవుల వాక్కులకు అనుగుణంగా కొంతకాలం అవధులు లేని, కృష్ణభక్తిలో మునిగి, కొన్ని నెలలు మధురలో గడిపి తిరిగి ఋషీకేశ్ చేరుకున్నారు. శ్రీ రామలాల ప్రభువుల వద్ద సేవ చేసుకుంటూ, భక్తుల ఉద్ధరణకై ప్రభువులు చూపిస్తున్న లీలలను ప్రత్యక్షంగా చూస్తూ, తన ధ్యాన సాధనలను నిరంతరంగా కొనసాగిస్తూ కాలం గడుపుతున్నారు యోగీంద్రులు. ప్రభువులను ఆశ్రయించి ఆరవ సంవత్సరం వస్తోంది.

- సశేషం

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

## శ్రీహరిరావు గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

15-12-1964 : ముక్కోటి ఏకాదశి నాడు తెల్లవారుతుండగా శ్రీ బాబు శ్రీహరిగారింటికి వచ్చారు. విమానంలో మూడు వేల మైళ్ళు తిరిగి వచ్చానని చెప్పారు. "ఎక్కడన్నా ఆశ్రమం కట్టుకోవాలంటున్నారు భక్తులు" అన్నారు శ్రీ బాబు. "మహానందిలో కడుతున్నారుగా బాబూ!" అని అంటే "అక్కడ చాలా బాగుంటుంది కదూ!" అన్నారు. శ్రీహరిగారు "మన భక్తులందరికీ సరిపోవాలంటే ఒక ఊరంతా ఆశ్రమం కట్టాలి బాబూ!" అన్నారు. శ్రీ బాబు "అవును! అందరూ అక్కడ ఉండవచ్చును. కాని మేం అక్కడ ఉంటేగా అసలు?" అని నవ్వేశారు.



17-1-1965 : (పుష్య పూర్ణిమ) రాత్రి శ్రీ బాబు తమ దివ్య బోధను అందించారు. "భగవంతుని దర్శన, స్పర్శలతో తృప్తి కలగదు. అనుభవాన్ని పొందాలి. ఆత్మానందమే ఆనందము. ఆత్మరతియే రతి. ఆయన దివ్య మంగళ స్వరూపుడు. లక్ష కోట్ల పూర్ణ చంద్రుల కాంతిని కుప్ప వేసినా, ఆ మధుర మూర్తి చిరు నవ్వులు చిందించే కాంతితో సరి తూగ లేదు. ఆయనకు నిత్యమూ రాక్షసులతో పోరాటమే. అయినా యిసుమంత కూడా అలసట లేదు. ముఖ కాంతి తరగదు. గోపికలు ఆ రహస్యం తెలుసుకుని అనుభవించి తరించారు. 'ఎన్ని యీతి బాధలు ఎదురైనా, ఎన్ని మోహ వికారాలు ఆవరించినా నీ పాదారవింద సేవ మాత్రము విడదీయకన్నా!' అని వేడుకొన్నాడొక మహాభక్తుడు. అటువంటి పరమాత్మను ధ్యానించి, పూజించి, సేవించి తరించండి."

15-2-1965 : శ్రీ బాబు ప్రతి మాఘపూర్ణిమకు గుంటూరులో సత్సంగ సమావేశాలకు విచ్చేయటం మొదలై నాల్గవ సంవత్సరం. ఆ రాత్రి శ్రీ సద్గురు పాద పూజా మహోత్సవం జరిగింది. "రేపు మనమందరం కోటప్పకొండకు వెడదాం" అన్నారు శ్రీ బాబు. రాత్రి ప్రయాణమై శ్రీ బాబుతో భక్తులందరూ

కోటప్పకొండ చేరుకున్నారు.

17-2-1965: ఉదయం త్రికూటేశ్వర స్వామి దర్శనం, సాయంత్రం సత్సంగ సమావేశములో సుశీల "కదలదు నీ సంకల్పము లేనిది। గడ్డిపోచయును కారణ కారణ" అని పాట పాడింది. శ్రీ బాబు "మహిమ తెలియ గలరా! నా లీలలు కనగలరా! అమరేంద్రాదులైనా" అని ఎంతో సేపు చక్కగా రాగాలాపన చేస్తూ పాడారు. తరువాత కామేశ్వరమ్మగారితో "నాకు సంగీతం రాదు, కంఠం బాగుండదు. అందుకని నీ బోటి సంగీత **'విధ్వాంసుల'** ముందు పాడాలంటే నా గుండె టక టకా కొట్టుకుంటుంది" అన్నారు.

18-2-1965: ఆలయంలో స్వామికి లక్ష బిల్వార్చన జరిగింది. సదాశివ స్వరూపులైన శ్రీ బాబు స్వయంగా పరమేశ్వరుని బిల్వ దళాలతో అర్చించారు. **'నా రుద్రో రుద్రమర్చయేత్'** ఆ రోజు సాయంత్రమే గురువుగారికి శ్రీ బాబు అద్భుతమైన దివ్య దర్శనానుభూతిని ప్రసాదించారు. ('లలితానంద సరస్వతీ స్వామి'అనే అధ్యాయంలో వివరాలున్నాయి). ఆ రాత్రి శ్రీ సద్గురు పాదపూజ అనంతరము బోధను అందించారు. "సత్వ రజ స్తమో గుణములనే మూడు ఆకులతో కూడిన మనస్సు అనే బిల్వ దళమును మానవుడు స్వామికి అర్పించుకోవాలి. అప్పుడా మూడు గుణాలూ సత్యము, శివము, సుందరములుగా మారిపోతాయి. ఆ బిల్వదళ పూజ జీవన్ముక్తిని ప్రసాదిస్తుంది" అని చెప్పారు.

-సశేషం

## చందాదారులకు విజ్ఞప్తి

మీ మాసపత్రిక చందా నెంబరు LM అనే అక్షరాలతో ప్రారంభమయితే మీ చందా గడువు ఇప్పటికే ముగిసినది. అయినా శ్రీగురుదేవుల ఆధ్యాత్మిక సంపద అందరికీ అందజేయాలనే మహదాశయంతో ట్రస్టువారు స్వంత ఖర్చుతో ఇంకా పత్రిక మీకు పంపుతున్నారు. కనుక దయచేసి 1,116 రూలు చెల్లించి మీ చందాను పునరుద్ధరించుకొనవలసినదిగా విజ్ఞప్తి.

(గత సంచిక తరువాయి) విష్ణు  కథలు -రమణ ప్రసాద్

# అవధూత పిచ్చమ్మ

కురుమద్దాలి ప్రాంతాలలో కలరా, రక్త విరేచనాలు మొదలైన అంటురోగాలన్నీ వస్తే, అమ్మ నిరాహార అయి ధ్యానంలో మునిగిపోయేది. రోగాలు పోయేవి.అప్పుడు అమ్మ ఇట్లా అనేది '. ఇవి రోగాలని డాక్టర్లు అంటారు.అవి అక్కమ్మ దేవతలు. నేను తపస్సు చేసి వాటిని పోగొడ్తాను. లేకపోతే పసిపిల్లలు బ్రతకేది ఎట్లా రా1?" అని.

అమ్మ దగ్గరకు బిడ్డలు లేని స్త్రీలు వచ్చేవారు. వారిని చూసి,"ఒసేయ్! నువ్వే ఒక మాయబొమ్మవైతే, నీకొక పిల్లబొమ్మ కావాలటే?" అనేది. ఒక్కొక్కరిని చూసి, "పుడతారులే పొమ్మ"నేది. కొందరికి, "దోషం ఉంది. ఈ పండు తిను దోషం పోతుంది" అని చేతిలో ఉన్న పండు ఇచ్చేది.



అమ్మ ధనం ముట్టుకొనేది కాదు. ఐశ్వర్యాన్ని "రోత" అనేది. వెండి బంగారాలు ముట్టుకుంటే అమ్మ ఒళ్ళంతా కాల్చినట్లు వుండేది. ఒక శిష్యుడు అమ్మను పరీక్షించాలని, అమ్మ మహదానందంలో తూగుతూ వున్నప్పుడు, అమ్మ చేతికి బంగారు ఉంగరం పెట్టాడు. అమ్మ ఉలిక్కిపడి, పామును విదిల్చినట్లు విదిల్చి బయటకు వచ్చి, 'చూశారట్రా! ఏం చేశాడో వాడు! పరధ్యానంలో వుండగా 'రోత' నా వ్రేలికి పెట్టాడు. అట్లా చెయ్యచ్చటరా! రోత నాకు తగిలితే మంటలు పుట్టవు రా!' అని జాలిగా చేయి విదల్చటంతో బంగారు ఉంగరం కాలవలో పడింది. పరీక్షించ దలచిన శిష్యుడు బిక్కమొఖం వేశాడు. అమ్మ చిన్నపిల్లలా "వాడి తిక్క బాగా కుదిర్చాడు నా రాముడు" అని నవ్వింది.

ఒంటినిండా నగలు పెట్టుకొని వచ్చిన వారిని "ఒసే మాయబొమ్మా! చాలా రోతలున్నాయే నీకు ఈ తిత్తిలో గాలి పోయాక ఈ రోతలన్నీ ఏమి చేసుకుంటావే" అనేది. సంపన్నులైన వారిని చూసి అమ్మ,"ఒరే! నీకు చాలా రోతలున్నాయి గద రా! అన్నదానం చేసుకో రా. ముందు దారి ఉంటుంది." అనేది.

అమ్మ తన పూర్వజన్మల గురించి ఇట్లా చెప్పేది."వీడు ఒక జన్మలో రాజు. తర్వాత వైష్ణవుడిగా పుట్టి మాలవాళ్ళను కోపగించుకున్నాడు. అందుకే ఈ జన్మలో మాలకులంలో పుట్టించాడు రాముడు" అనేది. మామూలుగా అర్ధనగ్నంగా ఉండేది. చెడు సంకల్పం ఉన్నవాళ్ళు వస్తే, "వీడికంట్లో దోషం ఉంది రా! దుప్పటి కప్పండి రా ! వాడు వస్తున్నాడు" అనేది.

ఒకసారి ఒక బ్రాహ్మణుడు అమ్మ మాలది అనే దృష్టిలో దూరంగా వుండి మట్లాడుతున్నాడు. అమ్మ," వడికిన నూలు పోగులు వేసుకుని గొప్పకులం వాడిని అని భ్రమ పడుతున్నావు. వడకని పోగులు నీలో ఉన్నాయి. వెతికి చూసుకో. దొరుకుతాయి." అంది.

ఛాందస బ్రాహ్మణుల హృదయాలను గ్రహించి,"మీకు ఆచారం వుంది. మలినం పోలేదు. దూరంగా ఉండి దణ్ణం పెట్టుకు పొండి. రామ నామం మాలా? నీ నామం మాలా? ఇందులో ఏది మాల?" అని ఎదురు ప్రశ్న వేసేది.

ఆధ్యాత్మిక మార్గం అంత సులభం కాదు. ఆత్మ యుద్ధం చేయాలి.'నా' 'నీ' అని లేకుండా పోవాలి. అప్పుడు కనపడతాడు దేవుడు. ఎద్దల్లే తిని మొద్దల్లే పడుకుంటే దేవుడు కనపడడు." అనేది.

అమ్మ అప్రయత్నంగా సమాధిలోకి వెళ్ళేది. అమ్మ దగ్గర ఉంటున్న శిష్యురాలు "లంబికాశివ యోగాభ్యాసం చేసి సమాధిలోకి వెళ్తున్నావా?" అని అడిగింది. "లంబికా శివయోగమో ఏమో! దానంతటకి అవే సంకెళ్ళు పడిపోతున్నాయి. నాకు ఏమీ తెలియదు" అని జవాబు చెప్పింది అమ్మ.

అమ్మ అనుకోకుండా భారత దేశ యాత్రలు చేసింది. శ్రీ వల్లభనేని అన్నపూర్ణమ్మ, శ్రీపిన్నమనేని నాగయ్యగార్లు ఆమెకు సేవ చేస్తూ అమ్మతో పాటు ఉన్నారు."యాత్రలకు వెళ్ళాం గాని క్షేత్రాలలో దేవుడికంటే నా లోని దేవుడే కమ్మగా ఉన్నాడు" అంది అమ్మ.

దక్షిణేశ్వరంలోని శ్రీరామకృష్ణ పరమహంస వారిని గురించి ఇలా అన్నది, "రామకృష్ణ పరమహంస "దేవి"**లో** ఇమిరాడు. "దేవి" పరమహంసలో ఇమిడింది. పరమహంసకు చావు పుట్టుకలు లేవు." అని.

శ్రీరమణ మహర్షులతో అమ్మ సమాగమం గురించి శ్రీ చలంగారు ఇలా వర్ణించారు: "ఒకసారి కురుమద్దాలి యోగిని మాల పిచ్చమ్మగారు భగవానుని దర్శించటానికి వచ్చారు.భగవాన్‌ని చూడగానే ఆయనమీద పడిపోయింది. ఆమెను లాగేద్దామంటే అంత విగ్రహాన్ని కదల్చటం ఎవరి తరం కాలేదు. "ఎప్పుడూ అంత దూరంలో ఏమిటి చూస్తుంటావు?" అని అడిగింది. "నువ్వు చూసేదే నేనూ చూస్తున్నాను"

అన్నారు భగవాన్.

అమ్మ అట్లా దివ్యప్రభలను దశదిశలా వెదజల్లుతూ, సర్వులకూ తల్లి అయి లీలగా ప్రారబ్ధాధీనమైన తనువును ధరించి తిరుగుతోంది.

1951 జనవరిలో అమ్మ భక్తులతో "ఒరేయ్! మఠం తగులపడిపోతోంది రా!" అంది. భక్తులు ప్రమాదాన్ని పసి కట్టారు. మరి రెండు రోజులకు "ఒరేయ్! వంటవాడు పైకి ఎక్కుతున్నాడు.ఇంక వంట తయారు అవదు." అన్నది.

భక్తులు అర్థం చేసుకుని తల్లి లేని పిల్లలం కాబోతున్నామనుకున్నారు. వారి కళ్ళలో నీళ్లు తిరుగుతున్నాయి.

శ్రీనాగయ్యగారు తినిపిస్తేనే తినే అమ్మ భక్తులతో, 'మీకు తోచింది పెట్టండి' అని అనుగ్రహించింది. అమ్మకు తమ చేతులతో తినిపించటం కంటే బిడ్డలకు ఆనందదాయకమేముంటుంది?

" ఈ రాత్రి ఒంటిగంటకు దీపం ఆరిపోతుంది" అంది అమ్మ.

జనవరి 15వ తేదీ రాత్రి భక్తులందరూ అశ్రుపూరిత నయనాలతో అమ్మ చుట్టూ చేరారు. గడియారం ఒంటిగంట కొట్టింది.అమ్మ భ్రూమధ్యం నుంచి గొప్ప ధవళకాంతి ఆశ్రమమంతా నిండి వెలిగింది.

అమ్మ సమాధిపై అమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించి నిత్య పూజలు ఉత్సవాలు చేస్తున్నారు. అమ్మ అనుగ్రహం శరణార్థులపై యధాపూర్వకంగా ప్రవహిస్తూనే ఉంది!

***మహాత్ముల ప్రబోధము మనస్సును ప్రక్షాళనమొనర్చి, సత్సంకల్పములను మాత్రమే ఉత్పన్నం చేస్తుంది. విన్న కాద్దీ విషయ నివారణ మొనర్చి విశ్వేశ్వర సాక్షాత్కారానికి దారి తీస్తుంది.***

-శ్రీశ్రీశ్రీ బాబూజీ మహరాజ్

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD